

ఏడు నెలల్లోనే సీఎం చంద్రబాబు 4 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు కృషి చేశారు. అభివృద్ధి, సంక్షేమంలో ముందున్న కూటమి ప్రభుత్వానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తెలిపి ఆశీర్వదించాలి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్,
మాజీ మంత్రి


శనివారం 18.01.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 | సంచిక -311 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00


## విజిలెన్స్, ఏసీబీ శాఖాపరమైన విచారణలు

# వేగవంతం చేయాలి



- ఏళ్ల తరబడి కేసులు పెండింగ్ లో ఉంచడం ఏమిటి?
- ఎన్ని కేసులు పెండింగ్ లో ఉన్నాయి...
- వాటి వివరాలేమిటో నివేదిక సిద్ధం చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఉద్యోగుల పనితీరు మీద సున్నితమైన విజిలెన్స్ ఉండాలి. వారు అప్రమత్తంగా, అత్యుత్తమంగా పని చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉద్యోగుల నిజాయితీ, పనితీరు, నిబద్ధతకు అది ఓ సూక్ష్మదర్శినిలా పని చేస్తుంది. అయితే ఉద్యోగులపై నమోదు అవుతున్న విజిలెన్స్ కేసులు, శాఖాపరమైన విచారణలు, దర్యాప్తులు, చర్యలు ఏళ్ల పాటు పెండింగ్ లో ఉండిపోవడం ఉద్యోగుల పని తీరుపై ప్రభావం చూపిస్తుంది' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.
క్రమశిక్షణ చర్యలు, శాఖపరమైన విచారణలకు సంబంధించినవి ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న అంశంపై ఉప ముఖ్యమంత్రి దృష్టి సారించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్., అటవీ, పర్యావరణ శాఖల్లో ఉన్న విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన కేసుల వివరాలు, అవి ఎంత కాలంగా పెండింగ్ లో ఉన్నాయి, అందుకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. కొన్ని కేసులు 20 ఏళ్ల నుంచి పెండింగ్ లో ఉన్న విషయం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. ఈ విధంగా కేసులు అపరిష్కృతంగా ఉండటం మూలంగా అధికారులు, సిబ్బంది, ఉద్యోగ విరమణ తర్వాత కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేదు. సిబ్బంది తమ ఉద్యోగ కాల పరిమితిలో పదోన్నతుల్లోనూ వెనుకబడిన వారున్నారని గ్రహించారు. ఈ క్రమంలో విజిలెన్స్ పెండింగ్ కేసులపై నివేదికను మూడు వారాల్లో ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. అభియోగాలు వచ్చిన వారిపై విచారణ ప్రారంభించినప్పుడు దానికి తగిన పత్రాలు అందుబాటులో ఉండటం లేదని, ఇది విచారణ జాప్యానికి కారణం అవుతోందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పందిస్తూ తన శాఖల పరిధిలో విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా తీసుకునే చర్యల్లో వేగం పెంచేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను సూచించారు. ఏదైనా విషయంలో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వస్తే ప్రాథమిక విచారణ పకడ్బందీగా జరపాలన్నారు. ప్రాథమిక విచారణలోనూ బలమైన సాక్ష్యాలు

● వివరాలు 2 లో



## ఖరారైన మంత్రి లోకేష్ దావోస్ పర్యటన...

- ప్రభుత్వ, పారిశ్రామిక వర్గాల్లో ఉత్సాహం
- యువతకు ఉద్యోగాలు, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా మంత్రి లోకేష్ దావోస్ టూర్!
- 5 రోజుల పర్యటనలో 50 మందికి పైగా ప్రముఖులతో సమావేశాలు
- 30 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న మంత్రి లోకేష్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పన, భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పెట్టుబడుల టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈనెల 20 నుంచి 24 వరకు దావోస్ లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరుకానున్నారు. అయిదు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా అంబాసిడర్లు, పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక రంగ పెద్దలతో మంత్రి లోకేష్ భేటీ కానున్నారు.
ప్రత్యేకించి ఏపి


● వివరాలు 2 లో



# ఇక అన్నీ మంచి రోజులే

వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పలు పథకాలకు శ్రీకారం

- పేదలకు గ్రామీణంలో 3 సెంట్లు, అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు భూమి
- రైతులకు పెట్టుబడి సాయం
- ఏటా రూ. 20 వేలు ఇచ్చేందుకు రెడీ
- ఈ విద్యా సంవత్సరం నుంచే తల్లికి వందనం
- తక్షణమే పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం
- ఎన్టీఆర్ రైతు భరోసాకు గ్రీన్ సిగ్నల్
- ఉచిత బస్సు ప్రయాణ పథకంపై చర్చ
- మరో 62 అన్నా క్యాంటీన్ల ఏర్పాటు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయించింది. వైఎస్సార్సీపీ హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్నదానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఎన్నికల హామీ మేరకు పేదలకు స్థలం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.
గ్రామీణంలో 3 సెంట్లు, అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు భూమి ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా అమలుకు సిద్ధం కావాలని నిర్దేశించారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ వెంటనే ప్రారంభమవుతుందన్న సీఎం అమరావతి పనులు కూడా వెంటనే మొదలవుతాయని తెలిపారు. మంత్రివర్గ సమావేశం తర్వాత పలు రాజకీయ అంశాలపై చర్చ జరిగింది.
తల్లికి వందనం ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని చంద్రబాబు కేబినేట్ నిర్ణయించింది. అలాగే పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం తక్షణం ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది..
గత వైసీపీ ప్రభుత్వం నిషేదిత జాబితా నుంచి తొలగించిన ఏడు లక్షల ఏకరాల భూమిపై నిర్ణయం తీసుకునేందుకు కేబినేట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయిచింది. ఇక పెర్రో ఎలాయిన్ పరిశ్రమలకు విద్యుత్ చార్జీల సబ్సీడీ ఇవ్వాలని కేబినేట్ నిర్ణయించింది.
ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం కేబినేట్

● వివరాలు 2 లో

వివరాలు 2 లో



## ఆ క్రెడిట్ మొత్తం ప్రధాని మోడీదే

- మంత్రి లోకేష్ సంతోషకర వ్యాఖ్యలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విశాఖ స్టీల్ ప్లాంట్ పూర్వవైభవం కోసం రూ. 11,440 కోట్ల స్పెషల్ ప్యాకేజీని ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. మూతపడే స్థాయికి చేరుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఆదుకుంటామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని

## సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్‌పై విచారణ



- విచారణ అథారిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు
- సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ప్రభుత్వం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై విచారణకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన అభియోగాలపై విచారణ అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ

## భక్తులకు మంత్రి లోకేష్ క్షమాపణలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విజయవాడ కనకదుర్గమ్మ దుర్గమ్మ గుడి వద్ద తాగునీటి సమస్యపై భక్తులు ఎక్స్ పోస్ట్ చేసిన వీడియోకు మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. కనకదుర్గ గుడి ప్రసాదం కౌంటర్ వద్ద నీటితో పాటు సరైన నిర్వహణ లేదని భక్తులు మంత్రి లోకేశ్‌కు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీంతో వెంటనే భక్తులకు కలిగిన అసౌకర్యంపై ప్రభుత్వం తరఫున క్షమాపణలు తెలియజేస్తున్నట్లు మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు. భవిష్యత్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం తన టీం ద్వారా సమస్యను సంబంధిత శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాలతో తక్షణమే రంగంలోకి దిగిన అధికారులు, భక్తులకు కావాల్సిన మంచినీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో మంత్రి చొరవ పట్ల భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

# చారిత్రాత్మక నిర్ణయం


- ప్రధాని మోడీ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు
- విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన చంద్రబాబు భావోద్వేగం
- ఆంధ్రుల అభీష్టం, కార్మికుల శ్రమ ఫలించింది
- విశాఖ స్టీల్ ప్లాంట్ ను సమర్థవంతంగా నిర్వహించడంలో మేనేజ్మెంట్, కార్మికులు బాధ్యత తీసుకోవాలి
- డబుల్ ఇంజిన్ సర్కార్ తో డబుల్ డిజిట్ గ్రోత్ కల సాకారమవుతోంది
- ఏడు నెలల్లోనే రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి
- రూ. 2 లక్షల కోట్ల పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు
- పట్టుదలతో పనిచేశాం-చిత్తశుద్ధితో ముందుకెళ్ళాం- అద్భుత ఫలితాలు సాధించాం : ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారికి, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ ఇచ్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామిని ఎన్డీఏ తరపున, రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా అభినందిస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఇది సమిష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు. ఏడు నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామని, ఏపీకి అన్నీ మంచిరోజులేనని ముఖ్యమంత్రి అన్నారు.
**విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు :** విశాఖ స్టీల్ ప్రాంట్ కోసం విశాఖ నగర వాసులే కాకుండా ఎంతోమంది ఉద్యమాలు, ఆందోళనలు చేశారు. ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. తెలుగుజాతి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి ఏడు నెలలుగా అన్ని ప్రయత్నాలు చేశాము. 1996లో స్టీల్ ప్లాంట్ కు ఇబ్బందులు వస్తే నాటి ప్రధాని వాజ్ పేయితో మాట్లాడి రూ. 1650 కోట్లు సాధించాము. స్టీల్ ప్లాంట్ కు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా ఆదుకుంది ఎన్డీఏ ప్రభుత్వమే. అదే సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్నదీ తెలుగుదేశమే.
**గత పాలకులు స్టీల్ ప్లాంట్ ను నిర్లక్ష్యం చేశారు :** గడిచిన ఐదేళ్లలో విశాఖ స్టీల్ ప్లాంట్ ను నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. స్టీల్ ప్లాంట్ ను కాపాడతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. ఇందుకోసం విశాఖ ఎంపీ భరత్ తనవంతు కృషి చేశారు. ఢిల్లీలో అనేక సమావేశాలు నిర్వహించాము. ఒకసారి ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ రాత్రి పన్నెండున్నరకు సమీక్ష చేశారు. పట్టుదలతో పనిచేశాం. చిత్తశుద్ధితో ముందుకెళ్లాం. ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు.
**అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం :** విశాఖ ప్రజల అభీష్టం, కార్మికుల శ్రమ ఫలించింది. నేను విశాఖలో పనిచేసే కార్మికులకు ఒకటే విన్నవిస్తున్నాను. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ను సమర్థవంతంగా నిర్వహించడంలో మేనేజ్మెంట్, కార్మికులు బాధ్యత తీసుకోవాలి. ఈ ఫ్యాక్టరీకి సమర్థవంతులైన సీఈవోను నియమిస్తాము. కావాల్సిన వనరులను సమీకరిస్తాం. స్టీల్ ప్లాంట్ కు 20 వేల ఎకరాల భూములున్నాయి. దేశంలో ఎక్కడా ఏ స్టీల్ ప్లాంట్ కు ఇంత విలువైన భూమి లేదు. అందరం కలిసి కష్టపడితే

2 లో

## విశాఖ స్టీల్‌కు కేంద్రం భారీ ప్యాకేజీ




- రూ.11, 400 కోట్ల ప్యాకేజీ కి కేంద్ర కేబినెట్ ఆమోదం
- తెలుగులో ట్వీట్ చేసిన ప్రధాని మోదీ

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సిద్ధమైన కేంద్రం 11 వేల 440 కోట్ల రూపాయలతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో గురువారం జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రత్యేక ప్యాకేజీ ద్వారా స్టీల్ ప్లాంట్‌కు పునర్వైభవం వస్తుందని భావిస్తున్నారు.
ఈ నిర్ణయాన్ని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పాటు ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి వెల్లడించారు. ప్రధాని చొరవతోనే ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్యాకేజీపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రధాని మోదీ ఎక్స్లో పోస్ట్ ద్వారా తెలియజేశారు.
రాష్ట్రంలోని ఓ జఠిలమైన సమస్య పరిష్కార దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేయడం ఆనందించదగిన పరిణామమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడంపై

2 లో

## గుంటూరు నగర కమిషనర్‌పై మేయర్ తీవ్ర అవినీతి ఆరోపణలు




- రూ. 9 కోట్ల బుడమేరు వరద బాధితుల నిధులను మింగేసిన కమిషనర్
- మేయర్ కావటి మనోహర్ నాయుడు

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బుడమేరు వరదల సమయంలో బాధితులకి సాయం చేసేందుకు ఇచ్చిన గుంటూరు కార్పోరేషన్ నిధులను కమిషనర్ పులి శ్రీనివాసులు దుర్వినియోగం చేశారని మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆరోపించారు. శుక్రవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించ కుండా కమిషనర్ వ్యవహరిస్తున్న నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ .. మేయర్, కార్పొరేటర్ లు కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రూ. 9.24 కోట్ల నిధులను కమిషనర్ పులి శ్రీనివాసులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు.
దీనిపై ప్రధానమంత్రి కి , సిఎం కి, కేంద్ర మంత్రుల కి, డిప్యూటీ సీఎంకి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. అవినీతి ఆరోపణ లు బయటకి వస్తాయనే కారణం తో కౌన్సిల్

2 లో

## ఏపీతో కలిసి పని చేయడానికి సిద్ధం



- ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తాం
- స్వర్ణాంధ్ర-2047 సాధనకు తోడ్పడతాం
- మా సేవలు వినియోగించుకోండి
- ఏపీని కోరిన ఎన్ఐఎస్‌జీ
- ఆర్టీజీఎస్‌లో ప్రభుత్వాధికారులతో సమావేశం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పని చేయడానికి తాము ఎంతో ఆసక్తితో ఉన్నామని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇన్సిటిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ ఐ ఎస్ జీ) సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్ అన్నారు. ప్రభుత్వ శాఖలకు కావాల్సిన సాంకేతిక సహకారం అందివచడానికి తాము సుముఖంగా ఉన్నామన్నారు. శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో ఎన్ఐఎస్‌జీ సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వాధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాజీవ్ బన్సల్ మాట్లాడుతూ నేషనల్ ఇన్సిటిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న వివిధ కార్యకలాపాల గురించి కూలంకుషంగా వివరించారు. ఆయా రాష్ట్రాలకు వారి అవసరాలను బట్టి ఈ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందించడంతో

2 లో

## ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడిని చితకబాదిన బీటెక్ రవి అనుచరులు

- పులివెందుల టీడీపీలో బయటపడిన వర్గవిభేదాలు



**పులివెందుల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైఎస్సార్ జిల్లా పులివెందులలో టీడీపీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి అనుచరులు మరోసారి రెచ్చిపోయారు. రేషన్ దుకాణం కోసం పరీక్ష రాయడానికి వచ్చిన వ్యక్తిని బీటెక్ రవి అనుచరులు చితకబాదారు. పులివెందుల నియోజకవర్గంలోని 79 రేషన్ దుకాణాలకు సంబంధించి పరీక్ష రాసేందుకు 104 మందికి హాల్ టికెట్లు అందజేశారు. వీరిలో MLC రాంగోపాల్‌రెడ్డికి అనుచరుడైన వేంపల్లికి చెందిన ప్రకాశ్ కూడా ఉన్నారు. పులివెందులలోని అహోబిలం పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న ప్రకాశ్‌ను బీటెక్ రవి అనుచరులు తీసుకెళ్లి చితకబాదారు. పరీక్ష రాయనీయకుండా అడ్డుకున్నారు.
విషయం తెలిసిన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి భార్య ఉమాదేవి ప్రకాశ్‌ను వదిలిపెట్టాలంటూ ధర్నాకు దిగారు. ప్రకాశ్‌ను వదిలిపెట్టే వరకూ పరీక్ష జరగనివ్వబోమని రాంగోపాల్‌రెడ్డి

2 లో

## ఖరారైన మంత్రి లోకేష్ దావోస్ పర్యటన...



(మొదటి పేజీ తరువాయి)

పెవిలియన్ లో ప్రపంచవ్యాప్తంగా పేరెన్నికగన్న 30 మంది పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా విద్యారంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులపై విద్యారంగ గవర్నర్ల సమావేశం లో పాల్గొంటారు. ఇంటెలిజెంట్ పరిశ్రమల కోసం మెరుగైన పర్యావరణ వ్యవస్థ నిర్మాణం, అధునాతన యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం , జెండర్ పారిటీ స్ప్రింట్ ఛాంపియన్స్ అంశాలపై ప్రముఖులతో నిర్వహించే సమావేశాలకు హాజరవుతారు. నెక్స్ట్ జెన్ ఎఐ, డాటా ఫ్యాక్టరీ, ఎఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు అంశాలపై ఎన్ విడియా ప్రతినిధులు, ఎఐ ఫర్ గుడ్ గవర్నెన్స్ పై గూగుల్ సంస్థ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. గ్లోబల్ ఎకనామీ స్థితిగతులు – లేబర్ మార్కెట్ పై ఎఐ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రభావం అనే అంశంపై వైట్ షీల్డ్ తో, భవిష్యత్తుపై వాతావరణ ఉద్యమ ప్రభావంపై అంశంపై స్వనీతి ఇనిషియేటివ్ ప్రతినిధులతో, వార్షిక లీడర్ ఫోరమ్ పునరుద్ధరణ నిర్వహించే సమావేశాలకు మంత్రి లోకేష్ హాజరు కానున్నారు. 5రోజుల సదస్సులో 30మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై ఎపిలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలు, మెరుగైన పర్యావరణ వ్యవస్థ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాల గురించి వారికి వివరిస్తారు. సిఎన్ బిసి – టివి 18, బిజినెస్ టుడే, ఎకనమిక్ టైమ్స్, బ్లూమ్ బర్గ్, మనీ కంట్రోల్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్ కు హాజరవుతారు. భారత్–డెన్మార్క్ మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ను బలోపేతం చేయడంపై నిర్వహించే సదస్సుతోపాటు కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించే కార్యక్రమానికి మంత్రి లోకేష్ అతిధిగా హాజరవుతారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్తున్న మంత్రి లోకేష్ వైపు పారిశ్రామికవర్గాలు ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి.

## విజిలెన్స్, ఏసీబీ, శాఖాపరమైన విచారణలు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సేకరించాలని, విచారణాధికారికి, ఆరోపణలు వచ్చిన ఉద్యోగికి మధ్య సన్నిహిత సంబంధాలు లేకుండా తొలి దశలోనే నిరోధించాలని స్పష్టం చేశారు. శాఖల్లోని అన్ని విజిలెన్స్, నాన్ విజిలెన్స్ కేసులను సరైన, సక్రమమైన రీతిలో తిరిగి విచారించి వేగంగా వాటిని పరిష్కరించేందుకు శాఖాధిపతులు దృష్టి సారించాలన్నారు.

## పక్షుల కోసం 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్లు హార్వర్డ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు



**అనంతపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం పట్టణానికి చెందిన అనిల్ కుమార్.. పక్షులను రక్షించడానికి 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్లు ఏర్పాటు చేశారు. యూకే (లండన్)కు చెందిన హార్వర్డ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఇది నమోదు అయ్యింది. అందుకు సంబంధించి సర్టిఫికెట్ అందించారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్నలను అనిల్‌కుమార్ కలిశారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. అనంతపురం నగరంలో గ్రీన్ ఆర్మీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పక్షులను రక్షించడానికి 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడా లేని విధంగా సహజ కొబ్బరికాయ, పీచుతో 1.40 లక్షల మానవ నిర్మిత గూళ్ళను ఏర్పాటు చేశామన్నారు. అందులో 2.50 లక్షల పిచ్చుకలు జన్మించాయని తెలిపారు. అనంతరం 'ప్రతి ఇంటా ఓ చెట్టు, ప్రతి ఇంటిపై మన జెండా' అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

## సత్యసాయి జిల్లాలో చిరుత - దాడిలో మేక బలి

**మడకశిర ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని నెలలుగా చిరుత పులులు సంచరిస్తూ ప్రజలందరినీ బెంబేలెత్తిస్తున్నాయి. ఇంటి ఆవరణలో, పొలాల్లో ఎక్కడబడితే అక్కడికి చొరబడి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సైతం చిరుత దాడులకు గురై ఎంతోమంది అమాయకులైన ప్రజలు తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అయితే ఈసారి చిరుత దాడిలో ఓ మేక బలైన ఘటన శ్రీ సత్యసాయి జిల్లాలో చోటు చేసుకుంది.

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం కల్లుమరి గ్రామంలో వ్యవసాయ రైతు నారాయణప్పకు చెందిన మేకపై చిరుత దాడి చేసి చంపేసింది. ఇంటి వెనక కట్టేసిన మేకను చిరుత అమాంతం ఎత్తుకెళ్లి సగభాగం తినేసి కళేబరాన్ని వదిలేసి వెళ్లింది. ఈ విషయాన్ని రైతు, స్థానికులు అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని చిరుత ఎక్కడెక్కడ సంచరిస్తుందో పరిశీలించారు. తరువాత మేకకు పోస్ట్మార్టం నిర్వహించి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని వెల్లడించారు.

శ్రీ సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి నియోజకవర్గంలో చిరుత సంచారం కలకలం రేపింది. దీంతో బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం, గోపాలపురం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి అప్పస్వామి అనే రైతు అరటి తోటలోకి చిరుత పరుగులు తీయడం చూశాడని గ్రామంలోని మరికొంత మంది యువకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలను తీసి అటవీ శాఖ అధికారులకు తెలియజేశారు.

# ఇకపై అన్నీ మంచి రోజులే

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహా.. కేబినేట్ మంత్రులంతా పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ మీటింగ్ ఇంకా కొనసాగుతున్నది.

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగుల రేషనలైజేషనకు చంద్రబాబు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతో 1.27 లక్షల మంది సచివాలయం ఉద్యో గులను రేషనలైజేషన్ చేయాలని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**ఫ్రీ బస్ పథకం.. ఎన్టీఆర్ రైతు భరోసా :** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేయాలని కేబినేట్ చర్చించింది.. ఈ పథకం అమలు కోసం ఏర్పాటు చేసిన కేబినేట్ సబ్ కమిటీ తన నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేసింది.. దీనిపైనే ఎక్కువ సమయం చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో మరో 62 అన్నా క్యాంటిన్ల ఏర్పాటునకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ రైతు భరోసా ఇచ్చే అంశంపై చర్చ జరిగింది.. దీనిపై విధివిధానాలను ఖరారు చేశారు.. ఏపీలో మూడు పంటలు పండించే రైతులకు రూ.20 వేలు సాయం అందించే విషయంపై కేబినేట్లో చర్చ జరిగింది.

**నధుల అనుసంధానం చేద్దాం.. :** ఏపీలో పెట్టుబడి పెట్టే పారిశ్రామిక వేత్తలకు భూమిని నామమాత్ర ధరలకే కేటాయించాలని కేబినేట్ సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. మద్యం దుకాణాలలో గీత కార్మికులకు 10 శాతం



కేటాయింపుకు ఆమోద ముద్ర వేసింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇటీవల లేవనెత్తిన అభ్యంతరాలను సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలో నదుల అనుసంధానం జరగాల్సిదేనని మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.. ఇదే సమయంలో, అంతర్–రాష్ట్ర సంబంధాలను మెరుగుపరుచుకోవాలని కొందరు మంత్రులు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటనపై కూడా ఏపీ కేబినెట్లో చర్చించారు.

# చారిత్రాత్మక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

మంచి ఫలితాలు వస్తాయి. నేను కూడా శ్రద్ధ పెడతాను. ప్యాకేజీ ఇచ్చిన కేంద్రం మెచ్చుకొనేలా పనిచేద్దాము.

**ఏడు నెలల్లో అద్భుత ఫలితాలు సాధించాం :** ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చుకుంటూ వస్తున్నాం. అమరావతికి కేంద్రం రూ. 15000 వేల కోట్లు ఈఏపీ ద్వారా ఇప్పించింది. నిలిచిపోయిన పోలవరానికి రూ. 12,157 వేల కోట్లు సాధించాము. రైల్వే జోన్ కు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఏడు నెలల్లో రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. రూ. 2 లక్షల 8 వేల కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. టీసీఎస్ రాకతో యువతకు ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, ఏఐ, డేటా సెంటర్ తో మంచి ఫలితాలు వస్తాయి. ఇక్కడి నుంచి సింగపూర్ కు సీ కేబుల్ వేసి అనుసంధానిస్తాము. గ్రీన్ హైడ్రోజన్ పై ఎన్టీపీసీ, జెన్ కో జాయింట్ వెంచరుగా రూ. లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టబోతున్నాం. మిథల్ ప్రాజెక్టుకు 14 మిలియన్ మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ ఇచ్చేందుకు కేంద్రం ఒప్పుకుంది. ఇది నక్కపల్లి దగ్గర తొందరలోనే ప్రారంభమవుతుంది. ఒక స్టీల్ సిటీ రానుంది. నక్కపల్లిలో స్టీల్ సిటీనే కాకుండా రూ. 14,000 వేల కోట్లతో ఫార్మా సిటీ వస్తోంది. దీని వల్ల 70 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. త్వరలోనే విశాఖ–అనకాపల్లి కలిసిపోతాయి. ఓర్వకల్లులో రూ. 2,786 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి రూ. 2,137 కోట్లు మంజూ–రయ్యాయి. రూ. 55 వేల కోట్ల వ్యయంతో జాతీయ రహదారులన్నీ రాబోయే



రెండు, మూడేళ్లలో పూర్తవుతాయి. అమరావతికి 8 లైన్ల అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్రాన్ని అనుమతి కోరాను. రూ. 400కోట్లతో టూరిజం కారిడార్ రాబోతోంది. సూర్యలంక, శ్రీశైలం, రాజమహేంద్రవరం, సంగమేశ్వరాలయం వంటి ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చేస్తాం.

**గత ఐదేళ్లలో రాష్ట్రమంతటా చీకట్లే :** ఈ ఏడాది రాష్ట్ర వృద్ధి రేటు 12.95 శాతానికి చేరింది. దీన్ని 15 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నాము. అభివృద్ధి సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాము. ఏడు నెలల క్రితం రాష్ట్రమంతటా చీకటే ఉంది. అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. కేంద్ర నిధులనూ దారిమళ్లించారు. మరో నాలుగైదు నెలల్లో అన్ని వ్యవస్థలను గాడిన పెడతాం. 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం. ఉన్న ఉద్యోగాలు కాపాడుకుంటూనే కొత్త ఉద్యోగాలు కల్పిస్తాము. మరోసారి విశాఖ స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

# ఏపీతో కలిసి పని చేయడానికి సిద్ధం





(మొదటి పేజీ తరువాయి)

పాటు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న సరికొత్త టెక్నాలజీలను ప్రభుత్వాలు సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవసరమైన సహకారం తాము అందిస్తామని చెప్పారు. తమది ఎలాంటి లాభాపేక్ష లేనటువంటి సంస్థని తెలిపారు. తక్కువ ఖర్చుతోనే ప్రభుత్వానికి తాము కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తామన్నారు.

గత రెండు దశాబ్దాలలో తమ సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. 30 వేల మందికిపైగా వివిధ స్థాయిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ కల్పించామని, 200లకుపైగా ప్రాజెక్టలను వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించామన్నారు. ఆంధ్రప్రదేశ్ తమ సంస్థకు మొట్టమొదటి ప్రమోటర్ గా పనిచసిందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వంతో మరింత దృఢమైన భాగస్వామ్యం ఏర్పరచుకుని ఏపీ ప్రభుత్వంలో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించాలని, ఏపీ ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందించాలని తమ సంస్థ ఎదురు చూస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా రూపొందించిన స్వర్ణాంధ్రఏ2047 లక్ష్యాల సాధనలో కూడా కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము ఆసక్తిగా ఎదురు చూస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వరెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్ ఐఎస్జీతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉందన్నారు.

ప్రభుత్వ శాఖలు తమ కార్యకలాపాలు అమలు చేసే సందర్భంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అవసరమని, ఆ దిశగా ఈ సంస్థ సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కూడా ఇప్పటికే డీప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తదిరత రంగాలపై చాలా చురుగ్గా పనిచేస్తోందని, ఈ దిశగా ఎన్ ఐఎస్టీ సహకారం కూడా తీసుకుంటామన్నారు. ఐటీ కార్యదర్శి ఎన్. యువరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో అమరావతిలో కూడా ఎన్ఐఎస్టీ ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే సముచితంగా ఉంటుందని సూచించగా దానికి ఆ సంస్థ ప్రతినిధుల సానుకూలంగా స్పందించారు. ఎన్ ఐ ఎస్ జీ సీఈఓ, ఆ సంస్థ ప్రతినిధుల బృందానికి ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్ స్వాగతం పలికారు.

## ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడిని చితకబాదిన బీటెక్ రవి అనుచరులు

(మొదటి పేజీ తరువాయి)

భార్య, అనుచరులు పాఠశాల వద్ద బైఠాయించారు. పోలీసులు జోక్యం చేసుకొని బీటెక్ రవి అనుచరుల చెర నుంచి ప్రకాశ్‌ను విడిపించారు. రెండురోజుల వ్యవధిలో బీటెక్ రవి అనుచరులు రెండుసార్లు బీభత్సం సృష్టించారు. గురువారం నాడు పులివెందుల నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియలోనూ బీటెక్ రవి అనుచరులు రెచ్చిపోయారు. జనసేనతోపాటు టీడీపీ నాయకులనూ టెండర్లు వేయనీయకుండా అడ్డుకొని దాడికి దిగారు. పులివెందుల నియోజకవర్గంలో బీటెక్ రవి, రాంగోపాల్‌రెడ్డి మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. అన్ని దుకాణాలూ తమవారికే దక్కాలన్న ఉద్దేశంతోనే బీటెక్ రవి అనుచరులు ఇలా దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ అంతర్గత వర్గపోరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

సీఎం చంద్రబాబు శనివారం వైఎస్సార్ జిల్లా మైదుకూరులో 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న వేళ బీటెక్ రవి అనుచరులు దాడులకు పాల్పడడం చర్చనీయాంశమైంది. వరుసగా రెండ్రోజుల పాటు జరిగిన ఘటనలను నిఘా వర్గాలు ప్రభుత్వానికి చేరవేశాయి. శనివారం సీఎం జిల్లాలో పార్టీ పరిస్థితి, నేతల పనితీరుపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది.

## సూపర్ సిక్స్‌లు అమలు చేయమంటే వింత మాటలు మాట్లాడుతున్నారు

**○వైఎస్ షర్మిల**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీ సీఎం చంద్రబాబుపై ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ' ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. దాటాక బోడి మల్లన్న' అనే సామెతను తలపిస్తోందని ట్విటర్‌లో ఆరోపించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటం చేసిన బాబు .. అమలుకొచ్చేసరికి ఆదాయం పెరిగితేనే అంటూ మడతపేచి పెట్టారని దుయ్యబట్టారు.

అప్పులు దొరకవని, ఆదాయం పెంచుకోవాలని, తలసరి ఆదాయం పెరగాలని, మనుషులు మన ఆస్తి అంటూ వింత వింత మాటలు చెప్తున్నారు. ఆడలేక మద్దెల దరువన్నట్లుందని బాబు వ్యవహారముందని ఆరోపించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చే ముందు తెలియదా రాష్ట్రం రూ. 10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని..? సూపర్ సిక్స్ హామీలు అమలుకు ఏటా రూ. 2 లక్షల




కోట్లు అవసరం ఉందని..? తెలియదా అంటూ ప్రశ్నించారు.

రాష్ట్ర బడ్జెట్ మొత్తం డైవర్ట్ చేసినా ఇంకా నిధుల కొరత ఉంటుందని తెలియదా..? అని అన్నారు. కేంద్రానికి మీరొక్కరే కాదని తెలిసినప్పుడు ఎందుకు మద్దతు ఇచ్చారు ?. రాష్ట్రాన్ని సహాయ పడనప్పుడు మోడీతో చెట్టాపట్టాలు దేనికోసమని నిలదీశారు. ప్రజలు ఓట్లేసి అధికారం ఇస్తే, ఏదో ఉద్ధరిస్తారని నమ్మకం పెట్టుకుంటే, హామీలను తుంగలో తొక్కి, విజన్ల పేరుతో , వృద్ధి రేట్ల సాకుతో కాలయాపన తప్పా..పనితనం శూన్యమని విమర్శించారు.

ఎప్పటికైనా రాష్ట్రానికి సంజీవని ప్రత్యేక హోదా. హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి. నిధులు పారాలన్నా, పరిశ్రమలు స్థాపన జరగాలన్నా, ప్రజల ఆదాయం పెరగాలన్నా.. యువతకు ఉద్యోగాలు రావాలన్నా. ప్రత్యేక హోదా ఒక్కటే శరణ్యమని షర్మిల పేర్కొన్నారు.

## విశాఖ స్టీల్‌కు కేంద్రం భారీ ప్యాకేజీ




(మొదటి పేజీ తరువాయి)

ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రివైవల్ ప్యాకేజీ కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్లాంట్ ఉత్పాదకత పెంచి లాభాల బాటలో పయనించేందుకు.. ఈ ప్యాకేజీ ఉపకరిస్తుందన్నారు. ఏపీ అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంటుకు కేంద్ర ప్యాకేజీని ఏపీ ప్రజలు స్వాగతిస్తున్నారని ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. కుమారస్వామి, నిర్మలాసీతారామన్, చంద్రబాబు కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. ప్లాంటును మరింత సమర్థంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. చరిత్రాత్మక నిర్ణయం: స్టీల్ ప్లాంటుకు కేంద్ర ప్యాకేజీ చరిత్రాత్మక నిర్ణయమని సీఎం చంద్రబాబు అన్నారు. ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయమని చంద్రబాబు ఎక్స్లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్యాకేజీపై ప్రధాని మోదీకి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నిర్మలా సీతారామన్, కుమారస్వామికి సైతం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆ క్రెడిట్ మొత్తం ప్రధాని మోడీదే

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి లోకేష్ తెలిపారు. ఉక్కురెక్కల ఆయుధాలతో ఏపీ సరికొత్త శిఖరాలకు ఎదుగుతుందని, లక్షల మంది జీవితాలను మార్చుతుందని అన్నారు. ప్లాంట్ కు పూర్వవైభవం తెచ్చేందుకు సహకరించిన మోడీకి మొత్తం క్రెడిట్ దక్కుతుందని పేర్కొన్నారు. వైజాగ్ ప్లాంట్ వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రలో కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి మద్దతుకు మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్‌పై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అథారిటీలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సాధ్యమైనంత త్వరగా సునీల్ కుమార్‌పై ఉన్న అభియోగాలపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది.


## గుంటూరు నగర కమిషనర్‌పై మేయర్ తీవ్ర అవినీతి ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. కౌన్సిల్ సమావేశంలో తప్పులు దొర్లితే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. కానీ ఒక సభ్యుడు మాట్లాడటం పై సందర్భం లేకుండా బాయ్ కాట్ చేశారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కమిషన్ కు ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. ఫోన్ ఆలస్యం గా అయినా చూసి మళ్ళీ తనకు తెలియ చేయాలని, అలా చేయకుండా రాత్రి కి రాత్రి కి తన సిబ్బందిని, గన్ మెన్ ను వెనక్కి పిలిపించారని చెప్పారు. అ–టెండర్, స్టాఫ్ ను తీ సేసినా తాను అడగలేదని అన్నారు. ప్రశ్న కి సమాధానం చెప్పాలని అడిగితే .. సమయం గడిచిన తరువాత కూడా క్వశ్చన్స్ అడిగితే జవాబు చెప్పడం లేదని మేయర్ అన్నారు.

వరద బాధితుల సొమ్ము రూ. 9.24 కోట్లు ఖర్చు చేశారని, ఆరు రోజుల్లో ఇంత సొమ్ము ఎలా ఖర్చు పెడతారు ? అని మేయర్ ప్రశ్నించారు. ఈ ప్రశ్న కి సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయారని మండిపడ్డారు. 9.24 కోట్ల రూపాయలు దోపిడీ జరిగిందని ధ్వజమెత్తారు. బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సాయం చేయాలని ఇచ్చిన నిధులు ఖర్చు పెట్టాలని తాము కోరామన్నారు. రూ. 9.24 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయనీ, ఈ నిధులలో ఈ.కోటేశ్వర రావు పేరున రూ. 50 లక్షలు చొప్పున ఎమౌంట్ మినహా మిగతా అధికారుల పేరున నిధులు ఎలా కేటాయించారు ? అని మేయర్ ప్రశ్నించారు. అవినీతి గురించి తాము ఇంకా మాట్లాడలేదని, అసలు సమావేశమే పెట్టకుండా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలు సాకుగా తీసుకుని కౌన్సిల్ సమావేశం జరగకుండా అడ్డుకున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

## తిరుమలలో చాగంటికి అవమానం అంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవం



**○టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు**

**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర రావు గురించి వైరల్ అవుతున్న వార్త పూర్తిగా అవాస్తవం అని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో చాగంటికి అవమానం అని వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. ట్విట్టర్ వేదికగా ప్రత్యేక పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా అసలు వాస్తవం ఇది అంటూ.. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మర్షి డా. చాగంటి కోటేశ్వర రావు ప్రతి ఏడాది జనవరి మాసంలో తిరుమల వచ్చి శ్రీవారిని సందర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జనవరి 14వ శ్రీవారి దర్శనం, జనవరి 16వ తేదీ సాయంత్రం తిరుపతి మహతి ఆడిటోరియంలోప్రవచనాలు ఇచ్చేందుకు 2024, డిసెంబర్ 20న టీటీడీ ప్రొసిడింగ్స్ ఇచ్చినట్లు తెలిపారు. చాగంటికి ఉన్న కేబినేట్ ర్యాంక్ ప్రోటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం జనవరి 14న శ్రీవారి దర్శనం ఏర్పాట్లను చేశామని, ఇందులోభాగంగా.. రాజబగీచ గెస్ట్ హౌస్ నుంచి శ్రీవారి ఆలయానికి వారిని తీసుకెళ్లేందుకు బగ్గీస్ ను, శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా అనుమతించేందుకు టీటీడీ ఏర్పాట్లను చేసిందని వివరించారు.

అయితే వయసు రీత్యా శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా వెళ్లే సదుపాయం ఉన్నా వారు సున్నితంగా తిరస్కరించడం జరిగిందని, పలువురు ప్రముఖులు, సాధారణ భక్తుల తరహాలోనే వైకుంఠం కాంప్లెక్స్ నుండి శ్రీవారి ఆలయానికి చేరాలని వారే స్వయంగా సూచించారని చెప్పారు. వారి సూచనల మేరకు వారే స్వయంగా వైకుంఠం కాంప్లెక్స్ నుంచి ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారని అన్నారు. అదేవిధంగా జనవరి 8వ తేదీన తిరుపతిలో జరిగిన తోపులాట ఘటన నేపథ్యంలో చాగంటి వారి ప్రవచన కార్యక్రమాన్ని మరొక తేదీకి వాయిటా వేస్తే బాగుంటుందని వారి దృష్టికి టీటీడీ అధికారులు తీసుకెళ్లగా.. ఈ విన్నపాన్ని చాగంటి అంగీకరించారని, తదుపరి వారి అపాయింట్మెంట్ తేదీలను మరోసారి తీసుకుని ప్రవచనాలు ఏర్పాటు చేసేందుకు టీటీడీ నిర్ణయించిందని తెలిపారు. ఇక వాస్తవం ఇలా ఉండగా.. బయోమెట్రిక్ ద్వారా కాకుండా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయంలోకి అనుమతించారని, చివరి నిమిషంలో పరిపాలనా కారణాల రీత్యా చాగంటి ప్రవచనాల కార్యక్రమాన్ని టీటీడీ రద్దు చేసినట్లు టీటీడీ ని పలుచన చేసేలా వాస్తవాలను వక్రీకరించి అసత్యపు వార్తను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ నాయుడు స్పష్టం హెచ్చరించారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రణాళికతో ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు**

విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్

గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు వివరించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నత అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్ని గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల గురించి వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ఈనెల 26వ తేదిన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు నిర్వహించే రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిపబ్లిక్ డే పరేడ్ ఛీఫ్ కోఆర్డినేటర్ సంబంధిత



విభాగాల సంస్థల సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. గౌరవనీయులు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తదితర ప్రముఖులు పాల్గొంటారని ఇందుకు మినిట్ టు మినిట్‌ను అనుసరించి తగు ఏర్పాట్లు చేస్తున్నాట్లు వివరించారు. వివిఐపిల రాకపోకలను సంబంధిత వ్యక్తిగత కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన వేదికను ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా రూపొందించి, స్టేడియం నందు పోర్ట్ వాల్ డిజైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మట్లాడుతూ వేడుకలలో పాల్గొనేందుకు విచ్చేసే విఐపి వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకల రిహార్సల్స్ నిర్వహించాలని, ఫుల్ డ్రస్ రిహార్సల్స్‌తో పరేడ్‌ను సిద్ధం చేస్తామన్నారు. వివిఐపి, విఐపిలు ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక సీట్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకల్లో ఆర్మీ కంటెంజెంట్ రాష్ట్ర పోలీస్ బెటాలియన్స్, ఎన్‌సిసి స్కౌట్ అండ్ గైడ్స్, పోలీస్ బ్యాండ్ వంటి విభాగాలు కవాతులో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు వివరించారు.

# ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలను నివారిద్దాం

- సమిష్టి కృషితో ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం
- రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు

విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్




ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సమిష్టి కృషితో ప్రజలలో అవగాహన కల్పించి ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబులు తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది నుండి నెల రోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాల ప్రచార సామాగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాలు, బుక్ లెట్స్ బ్యానెర్లను గురువారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు, డీటీసీ ఎ. మోహన్ లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల పట్ల ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రమాదాలు నివారించేందుకు ఎప్పటికప్పుడు రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు గల కారణాలను సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా కొంతమేరకు ప్రమాదాలను నివారించగలిగామన్నారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఏఆర్‌డీ) యాప్ ద్వారా రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తదితర భాగస్వామ్య పక్షాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సరైన విధంగా నమోదు చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాద బాధితులను కాపాడేందుకు కృషిచేసిన వారికి గుడ్ సమారిటన్ ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారి భద్రతపై ప్రజలను చైతన్యం చేయడంలో యువత, ఎన్‌జీవోలు తదితరులు వినూత్న జాగృతి కార్యక్రమాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేలా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధలను పాటించని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటున్నామన్నారు, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదలలో కీలకమైన మద్యం సేవించి వాహనాలు నడపడం డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆన్లైన్ ద్వారా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా అనేక చర్యలు చేపట్టినప్పటికి ప్రమాదాల నివారణలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. నెల రోజుల పాటు రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని రాజశేఖర్ బాబు పిలుపునిచ్చారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఎ. మోహన్ మాట్లాడుతూ 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని రోడ్డుభద్రతాపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో పోలీస్, వైద్య ఆరోగ్య , ట్రాన్స్ పోర్ట్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, తదితరశాఖల సమన్వయంతో స్వచ్ఛంధ సంస్థలు ప్రజలను భాగస్వాములను చేసి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రచారసామగ్రి విడుదల కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు ఆర్. ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, కె. శివరాం గౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ. రమణ, ఎన్ఎవస్ వర్మ, కేడీవి రవికుమార్, బి. శ్రావణి, సత్యన్నారాయణ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు, డిప్యూటీ డియంహెచ్ ఓ జె. ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## మావుళ్లమ్మ సన్నిధిలో క్రికెటర్ నితీష్ కుమార్, ప్రశాంత్



భీమవరం, జర్నలిస్ట్ ఫైల్

శ్రీ మావుళ్లమ్మ అమ్మవారిని ఇండియన్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డి, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు తనయుడు పులపర్తి ప్రశాంత్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు, అమ్మవారి ఫోటో అందించారు.

## కొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లతో సామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ లాండ్రీ పోర్ట్‌ఫోలియో విస్తరణ




విజయవాడ

భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ సరికొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. తెలివైన, సమర్థవంతమైన లాండ్రీ సొల్యూషన్స్‌లో కొత్త ప్రమాణాలను నిర్దేశించిన 12 కేజీ మోడళ్ల అద్భుతమైన విజయం తర్వాత, కొత్త 9 కేజీ వాషింగ్ మెషీన్ల శ్రేణి అదే శక్తివంతమైన పనితీరు, అధునాతన లక్షణాలను మరింత కాంపాక్ట్ పరిమాణంలో అందిస్తుంది. తాజా 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లు పెద్ద లోడ్‌లను నిర్వహించడానికి సరైన పరిమాణంలో ఉన్నాయి. బట్టలు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు వంటి రోజువారీ లాండ్రీకి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తాయి.

## మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ అందించేందుకు ఎమ్మెల్యే కృషి

**డ్రైనేజీలు పరిశీలించిన డీసీ వైస్ చైర్మన్ రఘునాధ్, ఏఈ**



అవనిగడ్డ, జర్నలిస్ట్ ఫైల్

రైతులకు మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ అందించేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని కోడూరు డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాధ్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని మోదుమూడి పరిధిలోని డ్రైన్లపై వచ్చే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా చేపట్టవలసిన పనులను గుర్తించేందుకు డ్రెయినేజీలను పరిశీలించారు. సాగునీటి సంఘ పరిధిలోని పొలిమేర కోడు డ్రైన్, మాచవరం డ్రెయినేజీల పూడికతీత పనులు చేపట్టాలని గుర్తించారు. ఈ డ్రైన్లపై ఆవశ్యకత ఉన్న ప్రదేశాలలో కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని గుర్తించారు. కార్యక్రమంలో డ్రైనేజీ ఏఈఈ అబ్దుల్ కరీమ్, బచ్చు మల్లి, తోట చక్రధర్, బచ్చు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు రావెళ్ల ఉదయ్ సహాయం



చల్లపల్లి, జర్నలిస్ట్ ఫైల్

అగ్ని ప్రమాద బాధితులకు దాతలు అండగా నిలవాలని చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్ కోరారు. మండల పరిధిలోని మంగళాపురంలో అగ్ని ప్రమాద బాధితులు గొరిపర్తి శ్రీనివాసరావు కుటుంబానికి రావెళ్ల కృష్ణ సేవా సమితి ద్వారా సహాయం అందచేశారు. సేవా సమితి వ్యవస్థాపకులు రావెళ్ల ఉదయ్ కుమార్ నూతన వస్త్రాలు, రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో తూము కృష్ణమోహన్, పర్చూరి సురేష్, కైతేపల్లి వెంకయ్య, గొరిపర్తి నరసింహరావు, మండవ చందు పాల్గొన్నారు.


## ఈ నెల 17 నుంచి శ్రీ మాతాజీ ప్రవచనాలు, దివ్య ఆరాధన కార్యక్రమాలు

భీమవరం, జర్నలిస్ట్ ఫైల్

ఈనెల 17, 18, 19 తేదీల్లో స్థానిక త్యాగరాజ భవనంలో భక్త సమాజ్, త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పూజ్యశ్రీ శ్రీమాతాజీ ప్రవచనాలు, శ్రీత్యాగరాజ స్వామి వర్ధంతి దివ్య ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ తెలిపారు. 17న తీర్థగోష్ఠి ప్రవచనాలు, 18న శ్రీత్యాగరాజ స్వామి దివ్య ఆరాధన సంకీర్తనలు, శ్రీమాతాజీకి సత్కారాలు, అనంతరం శ్రీమాతాజీ అనుగ్రహ సంభాషణలు, 19న లలిత సహస్ర నామ కుంకుమ పూజలు, పాదపూజ, భక్త ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తుమ్మలపల్లి శివ, ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజు, చెరుకువాడ సోదరులు తెలిపారు.

## యాపిల్ పళ్లతో బాల త్రిపుర సుందరికి అలంకరణ

భీమవరం, జర్నలిస్ట్ ఫైల్



ధనుర్మాసం సందర్భంగా స్థానిక మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి సుమారు 500 యాపిల్ పళ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆలయ అభివృద్ది కమిటీ అధ్వర్యంలో అకన రాంబాబు, నాగలక్ష్మి దంపతులచే అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 500 యాపిల్స్ తో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానవ జన్మ సార్థకత

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

భీమవరం, జర్నలిస్ట్ ఫైల్



ఆధ్యాత్మిక చింతనతో సత్యం ధర్మంతో గడపడం మానవ జన్మ సార్థకతకు మార్గదర్శకాలని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వయ వారిని మంత్రి శ్రీనివాస్ దంపతులు దర్శించుకున్నారు. మందిర అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం అందించి ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు ఆధ్యాత్మిక సామాజిక సాంస్కృతిక రంగాలకు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, సరిపిడకల రామారావు, జానపాటి మధుసూదన్ రావు, కుక్కల బాల తదితరులు పాల్గొన్నారు.

# రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వం

## -ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బివి



ఎమ్మిగనూరు, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.



గురువారం శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర మహోత్సవం పురస్కరించుకుని మాజీ మంత్రి వర్యులు కీ. శే.బివి మోహన్ రెడ్డి స్మారకార్థం ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 14 వ వార్షికోత్సవ ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలు 16 తేదీ నుంచి 19 తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి హాజరైప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ జనవరి 16 నుండి 19 వరకు జరిగే ఎద్దుల బండ లాగు పోటీలు 4 రకాల జరిగే పోటీల కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చారన్నారు.రైతుకు ఉండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎద్దుల బండ లాగు పోటీలు నిర్వాహకులు ముగతి ఈరన్న గౌడ్, కడిమెట్ల విరుపాక్షి రెడ్డి, గుంటుపల్లి భాస్కర్, కే మహేంద్ర బాబు,మురళీ కృష్ణ రెడ్డి, చెన్నా రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి,వాల్మీకి శంకరయ్య,కొండ న్న గౌడ్,రైస్ మిల్ నారాయణ రెడ్డి, రామదాసు గౌడ్, బంద నవాజ్, ప్రతాప్ శ్రీకాంత్,సోమేష్ రెడ్డి, తిరుపతయ్య నాయుడు,నజీర్ అహ్మద్, ఎన్వి రామాంజనేయులు వ్యాఖ్యాత (యాంకర్) రాయంకి వేమా రెడ్డి, కాసీమ్ వలి, సూర్యనారాయణ రెడ్డి, మల్లయ్య,జగదీష్, నరసింహారావు, దర్మాపురం గోపాల్,బోయ కేశ న్న, దేవదాసు, దోమ భీమేష్ తో పాటు బిజెపి నాయకులు నరసింహులు, జనసేన నాయకుడు సప్పోగు భాస్కర్ పాల్గొన్నారు.

## యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు

### -కబడ్డీ,పుట్ బాల్ పోటీలు : ఎమ్మెల్యే బివి





ఎమ్మిగనూరు. జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : మానసిక ప్రశాంతతకు క్రీడా పోటీలు కూటమి ప్రభుత్వం యువతను ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర పురస్కరించుకుని జూనియర్ కళాశాల ఆవరణలో మాజీ మంత్రి వర్యులు కీ. శే. బివి. మోహన్ రెడ్డి స్మారక అంతర్రాష్ట్ర పుట్ బాల్. కబడ్డీ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పుట్ బాల్. కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి యువకులతో కలిసి ఆటలు ఆడి వారందరి సంతోషాలను పాలుపంచుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి చూపడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. పోటమి గెలుపు సర్వ సాధారణంగా బావించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కౌన్సిలర్. కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు వేమన పద్య పోటీలు



పలమనేరు జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన వేమన పద్య పోటీలు నిర్వహి స్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి తులసీనాధం నాయుడు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కళామందిరంలో పోటీలు ఉంటాయన్నారు. 100కు పైగా పద్యాలు చెప్పగలిగే పిల్లలందరికీ బహుమతులు అందిస్తామన్నారు.

## జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో వైభవంగా సంక్రాంతి సంబరాలు



గూడూరు, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : గూడూరు పట్టణం లోని జక్కా వెంకయ్య శ్రామిక నగర్ లో సి.పి.ఎం.పార్టీ శాఖ కార్యదర్శి జోగి. శివకుమార్, సి.ఐ.టి.యు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం రోజు సాయంత్రం కామ్రేడ్.సీతారాం ఏచూరి స్మారక "ముగ్గుల పోటీలు" సంక్రాంతి సంబరాలలో భాగంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ ముగ్గుల పోటీ పర్యవేక్షణ సి.హెచ్.సుధారాణి, జి.వినీల నిర్వహణ లో చిన్నారులు, మహిళలు 15 మంది కలసి ఈ పోటీలలో పాల్గొనడం జరిగింది. ముఖ్య అతిథిలుగా గూడూరు తాసిల్దార్ సి.చంద్రశేఖర్, డాక్టర్.ఎం.ప్రవీణ్, విచ్చేసి ముగ్గులు పోటీలలో విజేతలుగా గెలుపొందిన మహిళలకు ప్రైజ్ లు అందజేయడం చేయడం జరిగింది. మొదటి బహుమతి గా పి.మహాలక్ష్మి, రెండో బహుమతి జి.సుప్రజ, మూడో బహుమతి ఎం.కావేరి గెలుచుకోవడం జరిగింది.

మిగతా 12 మంది మహిళలకు కూడా బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు సీనియర్ నాయకులు టి.వెంకటరామిరెడ్డి. భవన నిర్మాణ సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, పామంజి మణి, బి.వి. రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యా యులు ఉదయ భాస్కర్, వెంకటేశ్వర్లు బల్లి గోవర్ధన,మదన్,బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హంగేరి ఓబులరాజు డిమాండ్.



పలమనేరు, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : నెలరోజులపాటు ప్రభుత్వం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హంగేరి ఓబులరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పలమనేరులో జరిగింది. జిల్లాకమిటీ సమావేశం ఆయన మాట్లాడుతూ... జిల్లాలో భూసమస్యలు తీవ్రంగా వున్నాయి. వాటిని వెంటనే పరిష్కరించ టానికి రెవిన్యూ సదస్సులు నిర్వహించింది కానీ వాటి నిర్వహణ తీరు చూస్తే ఆ లక్ష్యంనెరవేరేలా లేదని అన్నారు. గత ప్రభుత్వ తీరుకు భిన్నంగా ఏమీ ఈ ప్రభుత్వం వ్యవహరించడం లేదనే భావన ప్రజల్లో వస్తున్న దని చెప్పారు. రిసర్వే పేరుతో గత ప్రభుత్వం భూ యజమానులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది.ఎలాంటి వారందరికీ న్యాయం చేసి తన నిజాయితీ నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో భూసమస్యలు పరిష్కారానికి అసైన్మెంట్ కమిటీల వంటి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తద్వారా తక్షణ శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

## దరఖాస్తు భూముల నిబంధనల ఉల్లంఘన నిజమే:తాసిల్దారు పార్వతి



వి.కోట జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : చిత్తూరు జిల్లా వీకోట మండలం తోటకనుమ గ్రామపంచాయతీ దండి కుప్పం వద్ద దరఖాస్తు భూములలో అక్రమ కట్టడాలు నిజమేనని ఎట్టకేలకు తేలింది.స్థానిక తాసిల్దార్ భూములను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల మేరకు సుమారు 8 ఎకరాలకు పైగా దరఖాస్తు భూములు అన్యాక్రాంతానికి గురైయ్యాయని అధికారుల పర్యవేక్షణలో తేలింది.వ్యవసాయ భూమిలో వ్యవసాయేతర పనులు చేపట్టడంపై తాసిల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తు భూములు అమ్మకూడదు, కొనకూడదని ,స్థానికేతరులు అసలు వాటి జోలికి రాకూడదని హెచ్చరించారు. వ్యవసాయం కొరకు భూములు ఇస్తే అక్రమ నిర్మాణాలు ఎలా చేపడుతారంటూ అక్రమార్కులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్వర్షన్ లేకుండా భవనాలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు.నిబంధనల మేరకు దరఖాస్తు పట్టాదారులకు కొనుగోలుదారులకు నోటీసులు జారీ చేయాలని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, విఆర్వోలకు ఆదేశించారు.

ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించుకోవడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ప్రభుత్వ భూమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని ఆక్రమణదారులను హెచ్చరించారు.కార్యక్రమంలో ఆర్ ఐ మోహన్ రెడ్డి,సీఐ సోమశేఖర్ రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## క్రికెట్ మ్యాచ్‌లో విన్నర్‌గా నిలిచి రూ.75,000 మొదటి బహుమతి



నెల్లూరు, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : గంగాధర నెల్లూరు మండలం బాలగంగనపల్లి పంచాయతీలో సంక్రాంతి సందర్భంగా జరిగిన RPL క్రికెట్ మ్యాచ్‌లో విన్నర్ గా నిలిచి 75,000 మొదటి బహుమతి గెలుచుకున్న అవలకండిగ గ్రామం రన్నర్స్ గా నిలిచి 50,000 ద్వితీయ బహుమతి గెలుచుకున్న వెనుగోపాలపురం ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బహుమతి లు అందజేసిన ప్రభుత్వ విప్ MLA థామస్ కుటుంబం సబ్యులు ఆర్గనైజ్ చేసిన వర్ర యువరాజా రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు.

## ఏబిఆర్ఎస్ అధ్యక్షునిగా చైతన్య కుమార్



వేంపల్లె, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : అఖిల భారత రజక సంఘం (ఏబిఆర్ఎస్)జిల్లా అధ్యక్షుడిగా వేంపల్లెకీ చెందిన కె.చైతన్య కుమార్ ఎన్నికయ్యారు. ఆ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్ ప్రకటించారు. చైతన్య కుమార్ మాట్లాడుతూ రజకులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి, పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడికీ కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలోని రజక సోదరులందరిని కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు.

## పంటలతో పాటు ఇల్లును ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు



పలమనేరు, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : రూరల్ మండలంలోని ముసలమడుగు వద్ద ఉన్న ఇందిరానగర్ గ్రామ సమీపంలోని గుడియాత్తం రోడ్డు పక్కన గల వ్యవసాయ భూముల్లో నివాసముంటున్న చంద్రయ్య అనే రైతుకు చెందిన తన పొలంలో ఇల్లు నిర్మించుకుని వ్యవసాయం సాగిస్తున్న నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున ఒంటరి ఏనుగు ఇందిరానగర్ గ్రామం మీదుగా వచ్చి పక్కనున్న కొందరు రైతుల పంటలను ధ్వంసం చేసి తర్వాత చంద్రయ్య అనే రైతు వ్యవసాయ పొలంలోని అరటి తదితర పంటలను ధ్వంసం చేసి అక్కడే వారి నివాసంలో కుటుంబ సభ్యులు ముగ్గురు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒంటరి ఏనుగు ఇంటిపై దాడి చేయడంతో ఆ శబ్దానికి అందరూ మేల్కొని భయాందోళన చెంది ఇంటినుంచి బయటకు వెళ్ళిపోయారు. వీరికి ప్రాణాపాయం తప్పింది అనంతరం ఒంటరి ఏనుగు ఆ ఇంటిపై దాడి చేసి ఇంటి గోడను తోసి ఇంటిపై ఉన్న సిమెంటు సీట్లను ధ్వంసం చేసి ఇంటిలోని 20 ముటల వరి ధాన్యాన్ని తినినంత తిని మిగిలిన ధాన్యాన్ని పారాబోసింది ఆ శబ్దానికి చుట్టుపక్కల వారంతా మేల్కొని అటవి శాఖ అధికారులకు ట్రాకర్స్ లకు తెలిపారు. ఆ క్షణంలో పక్కనే ఉన్న ట్రాకర్స్ అక్కడకు వచ్చి ఏనుగును మళ్ళించడానికి బలమైన శబ్దాలతో బాణాలు పేల్చుతున్నా కానీ ఏమాత్రం లెక్కచేయకుండా ఇంటిలోని ధాన్యాన్ని తింటున్నది అక్కడున్న వారంతా కేకలు వేయడంతో గంటలపాటు అక్కడే వారందరినీ భయాందోళనకు గురిచేసింది. ఉదయం ఆ ఏనుగును అతికష్టం మీద పక్కనున్న అడవిలోకి మళ్ళించారు. అప్పటికే అటవి శాఖ అధికారులు వచ్చి పంటలతో పాటు ధ్వంసమైన ఇంటిని పరిశీలించి వారికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం ఇస్తామని చెప్పి వెళ్ళారు. ఈ ఒంటరి ఏనుగు వలన చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తూ పంటపొలాలపై దాడి చేయడమే కాకుండా గ్రామాలపై చొరబడి పశువుల షెడ్డును పట్టుపురుగుల షెడ్లను మూగజీవాలను సైతం లెక్క చేయక నష్ట పరుస్తున్నది. ఈ ప్రాంత రైతులను ముప్పుతిప్పలు పెట్టిడమే కాకుండా పంటలతో పాటు ప్రాణనష్టాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు ప్రతినిత్యం రాత్రుళ్ళు నిద్రలేని రాత్రులు గడుపుతూ పొలాల వద్ద పడిగాపులు కాస్తూ ఉన్నా ఏదో ఒకవైపున వచ్చి పంటలను నష్టపరుస్తూనే ఉంది.

కావున ఈ ఏనుగును పట్టి తీసుకెళ్ళడని రైతులు లబోదిబోమంటున్నారు. వీటిపై అటవి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఇప్పటి వరకు పెండింగులో ఉన్న ప్రాంతాలలో హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు వెంటనే చేపట్టాలని ఈ ప్రాంత రైతులు ప్రజలు కోరుతున్నారు.

## సాయి కీర్తి హెూండా షోరూం లో బి. ఎస్ 6 వెహికల్స్ ప్రారంభోత్సవ సంబరాలు



గూడూరు జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : గూడూరు పట్టణం లోనీ సాయి కీర్తి హెూండా షోరూం లో గురువారం గూడూరు ఆర్.టి.వో కిషోర్ చే తులు మీదుగా యుని కా ర్న 160 - ఎస్పీ 125, బి.ఎస్ 6 - OBD2B కొత్త వెహికల్స్ ని ప్రారం భిం చారు . ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ప్రతి వాహన వినియోగదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు .అనంతరం. సాయి కీర్తి హెూండా షోరూం అధినేత సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మారు తున్న అధునాతన టెక్నాలజీ ను ముందుగానే ఊహించి అత్యాధునిక సిస్టమ్ తో వాహనదారులకు మోడల్స్ ను అందిం చడం లో హెూండా కంపెనీ ముందంజ లో ఉంటుందన్నారు . గూడూరు ఆర్టీవో కిషోర్ చేతు లు మీదుగా హెూండా బి.ఎస్ 6 - OBD2B వాహ నాలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని వాహన ప్రియులు సద్విని యోగం చేసుకోవాలన్నారు.ఆ కార్యక్రం లో షోరూం అధినేత సురేష్ కుమార్ రెడ్డి అయన కుమారుడు గ్రీష్మంత్ రెడ్డి , సుధాకర్ రెడ్డి ,షోరూం సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు .

## వ్యక్తిపై కత్తితో దాడి...



హిందూపురం, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : మున్సిపల్ పరిధిలోని మేళాపురంలో రామచంద్ర(39) అనే వ్యక్తిపై కొంతమంది కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ పాత కక్షలకారణంగా రామ చంద్ర అనే వ్యక్తిపై వారి బంధువులు కొంత మంది శరీర భాగంలోకి ఏడు కత్తిపోట్లు పొడిచారు. సమీప వాసులు వెంటనే బాధితున్ని స్థానిక ప్రభుత్వా సుపత్రికి తరలించారు.హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు బాధితుడు ఆరోపిస్తున్నాడు.ఈ విషయమై వన్ టౌన్ సిఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కోగటం రామసుబ్బమ్మ నేత్రదానం



పులివెందుల జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : పులి వెందుల మండలం, నల్లపురెడ్డి గ్రామానికి చెందిన కోగటం రామసుబ్బమ్మ (57 సంవత్సరాలు) మర ణించడం తో ఆమె మేనల్లుడు చంద్రమోహన్ రెడ్డి, కూతురు రామతులసి మనవళ్ళు ప్రేమ్ చర ణ్ రెడ్డి, ప్రణీత్ కుమార్ రెడ్డి లు నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ మరి యు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు కి సమాచారం ఇవ్వడం తో చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డిష్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో టెక్నీషియన్ హరీష్ తో కలిసి మృతురాలి నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి హైద రాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధి కి పంప డం జరిగింది. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ బంధువులు లేదా సన్నిహితులు మరణించిన 9966609364 లేదా 7093204537 లకు సమాచారం ఇచ్చినట్లు అయితే మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వం తో బాధపడు తున్న ఇద్దరు అంధులకు చూపు ఇవ్వడం జరుగు తుంది అని కావున ప్రతి కుటుంబం నేత్రదానం అనే ఈ బృహత్కార్యాన్ని కుటుంబ సంప్రదా యంగా అలవరచుకుని అందరహిత సమాజం కోసం పాటు పడవలసిన ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు గ్రామ పెద్దలు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## శనగ పంట నందు పంట కోత ప్రయోగం



సి.బెళగల్ జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : సి బెళ గల్ మండలంలోని పోలకల్ గ్రామంలో శనగ పంట నందు పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగంలో శనగ పంట ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఎన్నిక అయ్యారు. అని అర్థం గణాంక అధికారి ఆదినారాయణ తెలిపారు. ఈ క్రమంలో మొదటి పంటకోత నందు 5 , 5 కొలతల ప్రకారం ప్రయోగం నిర్వహించగా 2.810 కేజీల శనగ విత్తనాలు రావ డం జరిగినది. దీనిని అంచనా వేసుకొని ఎకరాకు 4.50 క్వింటాళ్ల విత్త నం వస్తుందని వ్యవసాయ అధికారులు మరియు ఇన్సూరెన్స్ ఏజెంట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఎంపిఈఓ వెంకటే శ్వర్లు, విఏఎలు ఆఫ్రిన్, ఊర్మిళ గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

## నిత్యావసాల కోసం ధర్నాలకు కూర్చున్న నలుపు రెడ్డి పల్లె గ్రామస్తులు



పులివెందుల జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : పులివెందుల లోని నల్లపురెడ్డి పల్లె గ్రామంలో ప్రజలు నిత్యవసర వస్తువులైన ప్రభుత్వ రేషన్ బియ్యం ,కంది బేడలు, చక్కర మరియు గ్రామంలో నీటి సౌకర్యం కూడా సరఫరా లేదని గ్రామస్తులు పులివెందుల వయా ముదిగుబ్బ అనంతపురం రహదారిపై ధర్నా వహించారు ఇంతవరకు ప్రభుత్వాలు మారిన తమకు ఎటువంటి ఇబ్బంది లేదని ఎప్పుడు బియ్యం నిత్యవసర సరుకులు కూడా సరిగా ఇవ్వలేదని వాటిని ఇచ్చినా కూడా ఇవ్వలేదని 7తేదీ వరకు మాత్రమే ఇస్తున్నారు. గ్రామస్తులు వాపోతున్నారు.

## వీర్నమల పశువుల పండుగలో పలువురికి తీవ్ర గాయాలు



రామకుప్పం, జనవరి 17, జర్నలిస్ట్ ఫైల్ : రామకుప్పం మండల పరిధి లోని వీర్నమల గ్రామంలో పశువుల పండుగలో పలువురికి తీవ్ర గాయా లు అయిన సంఘటన చోటుచేసుకుంది. గురువారం ఉదయం రైతులు తమ పశు వులను శుభ్రం చేసి రంగురంగు పూలను అలంకరించారు. గ్రా మ దేవత అయిన గంగమ్మ ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించి గ్రా మ ప్రధాన వీధులు పరుగులు తీయించారు. పశువులను నిలువరించే సమయంలో కుల్లగానూరు కు చెందిన శ్రీనివాసులు 20, తమిళనాడుకు చెందిన నర్సింహులు 22 ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యా యి. వీరిని కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు గ్రామంలో పలువురికి స్వల్పంగా గాయాలయ్యాయి.

## చినలింగాయపాలెంలో పొలం పిలుస్తోంది



ప్రత్తిపాడు (జర్నలిస్ట్ ఫైల్): కాకుమాను మండలంలో చిన్న లింగాయపాలెం,కొండ బాలవారి పాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ రబీ సీజన్లో రైతులు వేసిన పంటలు వివరాలను ఆయా ఆర్ఎస్కే లందు ఈ క్రాపు బుకింగ్ చేయించుకోవాల్సిందిగా కోరుచున్నాము అన్నారు. తరువాత ఈ కేవైసీ కూడా పూర్తి చేయించుకోవాల్సిందిగా కోరుచున్నాము అని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలియజేసినారు. ఇంకా మొక్కజొన్న సాగులో మెలకువలు కత్తిరి పురుగు అరికట్టే యాజమాన్య పద్ధతులును,కత్తెర పురుగును అరి కట్టటానికి ఉదయాన్నే మంచు పడే టైంలో ఎకరాకు 150 ఎంల్ ఇమామెట్టిన్ బెంజోడు(ప్రోక్లైన్),150 ఎంల్ నవల్యూరాన్ (రీమాన్)120 లీటర్ల నీటిలో ఇంకా ప్రోక్లైను,డెల్టా మిత్రిన్ కాంబినేష తో కలిపి స్ప్రే చేయవచ్చు అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల విఏఏలు,రైతులు పాల్గొన్నారు.

## పేదల కోసమే ఉచిత కంటి వైద్య శిబిరం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): జిల్లా అందత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక శారదా కాలనీ మామిళ్ళపల్లి మాలకొండయ్య స్తూపం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరానికి సిపిఐ 48వ డివిజన్ కార్యదర్శి ఇరిగినేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు,జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్,నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొని సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్,రావుల అంజిబాబు,చల్లా మరియదాసు,AIYF జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య పాల్గొన్నారు. 51డివిజన్ సిపిఐ కార్యదర్శి దండు రవి కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు.

## మతోన్మాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో మతోన్మాద శక్తులు పాగా వేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని అలాంటి శక్తుల ఎడల అప్రమత్తంగా వుండి ప్రతిఘటించాలని సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి. హెచ్. బాబురావు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడిపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సి. హెచ్. బాబురావు మాట్లాడుతూ కేంద్రంలో బి. జె. పి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకులు, పెట్రోలు,డీజిల్,వంట గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయని, మరోవైపు సాధారణ ప్రజలకు ఉపాధి తగిన విధంగా లేదని, పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ,రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్ధానం చేసి, సర్దుబాటు ఛార్జీల పేరుతో 16వేలకోట్ల రూపాయాలు విద్యుత్ భారాలు మోపడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్ధానాలు అమలు చేయాలని,ఉచిత ఇసుక విధానాన్ని అమలు పరచాలని కోరారు. సిపియం జిల్లా కార్యదర్శి వై. నేతాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని, అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలిచ్చి ఇళ్ళు నిర్మాణానికి కనీసం 5లక్షలు కేటాయించాలని కోరారు. రేతాంగం అనేక వ్యయ ప్రయాసలకోర్చి పంటలు పండిస్తే గిట్టుబాటు ధర రావడం లేదని, మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని,జిల్లాలో ఖాళీగా వున్న అంగన్ వాడీ పోస్టులను భర్తీ చేసి అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలాని,ఎన్నికలకు ముందు స్కీమ్ వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అ-ప్పారావు, ఎన్. భావన్నారయణ, కె. నళీనికాంత్,ఎమ్. రవి,బూరగ వెంకటేశ్వర్లు,ఎల్. అరుణ, యస్. యస్. చెంగయ్య, జవహర్‌లాల్,పి. కృష్ణ, ఎమ్. ఎ. ఛిష్టీ తదితరలు పాల్గొన్నారు.

# మంగళగిరిలో ఉత్సాహంగా కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు





**○ఆరవ రోజు విజయం సాధించిన నెల్లూరు, తూర్పుగోదావరి జట్లు**

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ): మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు ఆరవ రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. నెల్లూరు వర్సెస్ ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ప్రకాశం జట్టు టాస్ గెలిచి నెల్లూరు జట్టును బ్యాటింగ్ కు ఆహ్వానించగా నెల్లూరు జట్టు నిర్ణిత 20 ఓవర్లలో 155 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ కు దిగిన ప్రకాశం జట్టు 14.1 ఓవర్లలో 90 పరుగులు చేసి ఆల్ అవుట్ అవడంతో నెల్లూరు జట్టు 65 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 ఓవర్లలో 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసిన సాలుంకి అఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను కైవసం చేసుకున్నారు. చిత్తూరు వర్సెస్ తూర్పుగోదావరి మధ్య జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 9 వికెట్ల నష్టానికి గాను 138 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 19.5 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆల్ అవుట్ అవ్వడంతో పరాజయం పాలైంది. టివి సాయి శ్రావణ్ 46 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను గెలుచుకున్నారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఇద్దరికీ పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి సహకారంతో ఒక్కొక్కరికీ రూ 10వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈవెంట్ స్పాన్సర్లగా సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ప్రతి మ్యాచ్‌ను గోపి టీవి యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రచారం అందించడం జరుగుతుంది. ప్రీమియర్ లీగ్, సిజన్-3 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ 3 లక్షలు కొమ్మారెడ్డి కిరణ్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు కాట్రగడ్డ మధు సుధన్ రావు, తృతీయ బహుమతి కింద రూ. లక్ష నగదును పల్నాటి నాగేశ్వరరావు, అమ్మిరెడ్డి సాంబశివరావు సహకారంతో బహుమతులు ప్రధానం చేయనున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ. 50 వేలు బత్తుల హరిదాస్, బెస్ట్ బ్యాట్స్ మెన్ కు రూ 25 వేలు కాసరనేని జస్వంత్, బెస్ట్ బౌలర్ కు రూ 25 వేలు తాడిపత్రి అజయ్ కుమార్, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ. 10 వేల నగదును భోగి వినోద్, కనికళ్ళ చిరంజీవి సహకారంతో నగదు బహుమతులు అందించనున్నారు.

# వెల్ నెస్ క్లినిక్‌లతో ప్రజారోగ్యానికి భద్రత

**○గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో వెల్ నెస్ క్లినిక్ ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్**

**○ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి**



గుంటూరు సిటీ (జర్నలిస్ట్ ఫైల్ ): వెల్ నెస్ క్లినిక్ లు ప్రజల ఆరోగ్యానికి సంపూర్ణ భద్రత కల్పిస్తాయని, వీటి ద్వారా రోగాల రాక ముందే అప్రమత్తం చేస్తారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలల్లో శుక్రవారం వెల్ నెస్ క్లినిక్ ను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకులు పరుగుల జీవనంలో ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోతోందని, దీంతో చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముందు చూపుతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం అందించాలనే దృక్పథంతో ప్రభుత్వ వైద్యశాలల్లో వెల్ నెస్ క్లినిక్ లు ఏర్పాటు చేస్తున్నారని వెల్లడించారు.

రాష్ట్రంలో పేరుగాంచిన గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో వెల్ నెస్ క్లినిక్ ఏర్పాటు పేదలకు వరంలాంటిదన్నారు. రోగాలు రాక ముందే వైద్యులు పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలు చేస్తారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అగ్ర తాంబూలమిస్తోందని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను పేదలకు సమర్థవంతంగా అందేలా చూడటమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో సోమ, బుధవారం మూడో నంబర్ ఓపీలో వెల్ నెస్ క్లినిక్ లు పని చేస్తాయని ఎమ్మెల్యే నసీర్ వెల్లడించారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరెన్టెంట్ ఎస్ ఎస్ వి రమణ, కార్పొరేటర్ సమత, డాక్టర్ ఉమా శంకర్, ఫిరోజ్, పోతురాజు చంద్ర, తదితర అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ - దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

తెనాలి ( జర్నలిస్ట్ ఫైల్ ) : తెనాలి స్థానిక 10 వార్డు లోని జంద్యాల వారి వీధిలో శుక్రవారం మునిసిపల్ కమిషనర్ బండి. శేషన్న ఆదేశములముల మేరకుకుఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ అసిస్టంట్ కమిషనర్ వల్లూరి. లక్ష్మీపతి రావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కారుమూరు హెలెన్ నిర్మల,టిపిఒ, ఎం .సాంబశివరావు,శానిటేషన్ మరియు సచివాలయం సిబ్బంది పాల్గొని ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు పెరగకుండా రీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగామున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మహా లక్ష్మీపతి రావు మాట్లాడుతూ దోమల వలనఅనేకరకా వ్యాదులు వస్తాయని, అందువల్లదోమల పెరుగుదాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు. యిండ్లలో వుండే ఖాళి పాత్రలు, టైర్లు, రోలు వంటి వాటిలో నీరు నిల్వఉండకుండా చూసుకోవాలని యన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమల ను నివారించుకోవచ్చునిఅన్నారు. అందరూ దోమతెరలు వాడా లనుసూచి%శీ%చారు. న్నారుతెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి అందె బాల చంద్రమౌళి,శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎఏన్ఏం అక్కమ్మ, వాత్సల్య, శంషాద్ బేగం, ఆశా కార్యకర్తలు,సంధ్య, అలేఖ్య, ఝాన్సీ లక్ష్మి, నగరదీ పిక దుర్గ, శానిటరీ సెక్రటరి లక్ష్మి, రిసోర్స్ పర్సన్ గొల్లపూడి శివజ్యోతి ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నందమూరి తారక రామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తున్నాము



గుంటూరు సిటీ (జర్నలిస్ట్ ఫైల్) :తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు వర్ధంతిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, పలు సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి వెంటనే పరిష్కరించారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి శనివారం నాడు జరిగే ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకునేలా పార్టీ నేతలకు ఎమ్మెల్యే దిశానిర్ధేశం చేశారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలన్న సంకల్పంతో పార్టీ పెట్టిన ఎన్టీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గములో అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో పాటు నగరంపాలెంలోని రిజిస్టర్ ఆఫీస్ వద్ద, నల్లచెరువు 3 బొమ్మల సెంటర్, కొరిటెపాడు మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలు జరగబోతున్నాయని, ఈ కార్యక్రమాలను పార్టీ నేతలు పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

**శాశ్వత సభ్యత్వం తీసుకున్న సుఖవాసి శ్రీనివాసరావు**

ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు శుక్రవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా 1 లక్ష రూపాయలతో శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి సుఖవాసి శ్రీనివాస్ రావును అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో సరికొత్త రికార్డు సృష్టిస్తున్నదని నేటితో 1కోటి సభ్యత్వాల మార్క్ దాటిందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు వేగంగా జరుగుతున్నదని, ఇదే స్ఫూర్తితో నాయకులు శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

## పొన్నూరు ఎస్సై-న్యాయవాది సంఘటనపై దర్యాప్తు వేగవంతం

**○గుంటూరు జిల్లా పోలీసుల ప్రకటన**

గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ): కొద్ది రోజుల క్రితం పొన్నూరు పట్టణ ఎస్సై రాజ్ కుమార్ మరియు పొన్నూరు బార్ కౌన్సిల్ న్యాయవాది బేతాళ ప్రకాష్ రావు మధ్య చోటుచేసుకున్న సంఘటనపై దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లా పోలీస్ కార్యాలయం చర్యలు తీసుకుంది.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు ఎస్సై రాజ్ కుమార్‌ను అదే రోజు విఆర్‌కు పిలిపించి, ప్రత్యేకంగా ఒక డీఎస్పీని దర్యాప్తు కోసం నియమించారు. ఎస్సై, న్యాయవాది మధ్య జరిగిన ఘటనకు సంబంధించి నమోదైన కేసుల దర్యాప్తు కోసం మరొక డీఎస్పీని కూడా నియమించారు.

డీఎస్పీ నివేదిక ఆధారంగా ఎస్సై రాజ్ కుమార్‌పై తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.

జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు న్యాయవాదులు సహకరించాలని జిల్లా పోలీస్ కార్యాలయం అభ్యర్థించింది.

# సీనియర్ సిటిజన్స్‌తో సమావేశం అయిన కమిషనర్



గుంటూరు సిటీ (జర్నలిస్ట్ ఫైల్ ):


గుంటూరు నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సూచనలు సలహాలు ఎంతో దోహదపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్ తో ప్రత్యేక సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, అటువంటి వారి సూచనలు సలహాలు నగరాభివృద్ధికి ఎంతగానో అవసరమన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, త్రాగు నీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పార్కులు, డివైడర్ల నిర్వహణ వంటి అంశాల పై నిర్మాణాత్మకమైన సూచనలు అందించాలని కోరారు. సీనియర్ సిటిజన్స్ మరియు జియంసి అధికారులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, గ్రూప్ లో తమ అభిప్రాయాల్ని పోస్ట్ చేయవచ్చునని తెలిపారు. కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న తగ ఐదు నెలల కాలంలో పారిశుధ్యం, రోడ్ల ఆక్రమణ, డ్రైన్లలో పూడికతీత, త్రాగు నీటి సరఫరా పై ప్రనాలికాబద్ధమైన కృషి చేశామన్నారు. రాబోవు కాలంలో సీనియర్ సిటిజన్స్ సూచనల ద్వారా నగరాభివృద్ధికి, నగర్ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలూ కల్పించుటకు కృషి చేస్తామన్నారు.

అనంతరం పలువురు సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ, తొలిసారిగా నగరాభివృద్ధి, నగరంలో చేపట్టాల్సిన అంశాల పై తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపేందుకు సమావేశం ద్వారా వేదిక కల్పించినందుకు నగర కమీషనర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే రోడ్లపై ర్యాంపులు ఆక్రమణలను లేకుండా చూడాలని, అనధికారిక ఫుడ్ స్టాల్స్ తొలగించి నగరంలో ప్రాంతాల వారీగా ఫుడ్ కోర్ట్ లు పెట్టాలని, ప్రతి వార్డులో సీనియర్ సిటిజన్స్ కు కమ్యూనిటీ హాళ్ళు నిర్మాణం, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు.

సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్ సి. హెచ్ శ్రీనివాసరావు, యస్. ఈ నాగమల్లేశ్వర రావు, సి. పి రాంబాబు, సి. యం. ఓ. హెచ్ డాక్టర్ అమృతం, పి. ఓ రామారావు, ఎ. డి. హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జాస్పర్ ఇండస్ట్రీస్‌లో దొంగలించబడిన కారు



**○అతి తక్కువ సమయంలో నేరస్తులను గుర్తించి పట్టుకొని తమ కారును అప్పగించిన కాకాని పోలీస్ స్టేషన్ సీఐ టీపీ. నారాయణస్వామి**

గుంటూరుసిటీ (జర్నలిస్ట్ ఫైల్): జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా కార్ షోరూమ్ ఆటోనగర్ గుంటూరు లో 15. 01. 2025 తేదీన బుధవారం తెల్లవారుజామున మా షోరూంలో ఉన్న కొత్త సఫారీ కార్ ను ఒక వ్యక్తి వచ్చి సెక్యూరిటీ గార్డ్ తో మా కార్ మీ షోరూం లో వుంది ఒకసారి అర్జెంటు గా చూడాలి అని చెప్పి ట్రయిల్ నిమ్మితం కార్ కిందకి దింపి సెక్యూరిటీ గార్డ్ ని బెదిరించి భయపెట్టి కార్ ను తీసుకొని వెళ్ళిపోయాడు. తీస్కొని వెళ్లిన వ్యక్తి తిరిగి రాక పోయే సరికి కార్ పోయినట్టుగా గుర్తించి పెదకాకాని పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా సీఐ టిపి. నారాయణ స్వామి మరియు, ఎస్ఐ. మీరాజ్ సత్వరమే స్పందించి వారి యొక్క సిబ్బందితో ట్రేస్ చేసి షోరూమ్ నుండి దొంగిలించిన సఫారి కార్ ను మరియు వ్యక్తిని చాలా తక్కువ సమయంలో పట్టుకోవడం జరిగినది. ఈ కేసు విషయంలో మాకు అన్నివిధములుగా సహకరిచిన సీఐ నారాయణ స్వామి, ఎస్ఐ. మీరాజ్ మరియు వారి సిబ్బందికి జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ తరుపున పత్రికా ముఖంగా అభినందనలు తెలియచేస్తున్నాము .

# న్యాయం పక్షాన నిలబడండి : న్యాయవాదులకు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపు

**○పల్నాడు లీగల్ సెల్ అధ్యక్షురాలు మాధవిని ఘనంగా సత్కరించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి**



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) : రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలపై జరుగుతున్న న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి న్యాయవాద లోకానికి పిలుపునిచ్చారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో వేధిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ న్యాయం పక్షాన నిలబడాలనీ.. చట్టపరంగా గొంతెత్తి నినదించాలనీ.. నిలదీసి నిగ్గు తేల్చాలనీ.. ఆయన కోరారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేసేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని లేళ్ళ అప్పిరెడ్డి ప్రకటించారు.

పల్నాడు జిల్లా వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షురాలుగా నియమితులైన ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రోళ్ళ మాదవి శుక్రవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంటూరులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన న్యాయవాదులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు.

అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో లీగల్ సెల్ ప్రధాన భూమిక పోషిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను వైయస్ జగన్ ఆవిష్కరించిన తర్వాత మొట్టమొదటిగా ఎగరేసిన ఘనత గుంటూరు న్యాయవాదులకే దక్కుతుందని కొనియాడారు. నాటి నుంచి తనతో పాటు లీగల్ సెల్ నేతలంతా ఎత్తిన జెండా దించకుండా పార్టీ జెండాను భుజాన మోస్తూనే ఉన్నారని తెలిపారు. అందుకే వారందరికీ పార్టీ ఎప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. అంతే కాకుండా కష్టకాలంలో వెన్నంటి నిలిచిన వారిని ఎప్పటికప్పుడు తగిన గుర్తింపు, గౌరవంతో పాటు పార్టీలో సముచిత స్థానం కల్పించినట్లు ఆయన వెల్లడించారు.

ఈ క్రమంలోనే వైసీపీ లీగల్ సెల్ ఆవిర్భావం నుంచి చేపట్టిన ప్రతి కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తున్న రోళ్ళ మాధవి పల్నాడు జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైనట్లు ఆయన వెల్లడించారు. అది కూడా మరే ఇతర పార్టీల్లో లేని విధంగా రాష్ట్రంలోనే ఆమె తొలి అధ్యక్షురాలు కావడం విశేషమని ఆయన అభిప్రాయ పడ్డారు. ఆమె నేతృత్వంలో పల్నాడు జిల్లాలో లీగల్ సెల్ మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం ఛైర్మన్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, వైసీపీ లీగల్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, సోమసాని జాన్సీలక్ష్మి, కళ్ళం రమణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, కోటి, శ్రీనివాసరెడ్డి, మొండితోక శ్రీనివాస రావు, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కెఎస్‌టి సింగ్, గౌతమి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, పోలూరి వెంకటరెడ్డి,దూపాటి వంశీ, పార్టీ నేత గోళ్ళ శివ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# నేడు మైదుకూరులో సీఎం చంద్రబాబు పర్యటన



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): నేడు మైదుకూరులో ఏపీ సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. శనివారం కడప జిల్లా పర్యటనలో భాగంగా మైదుకూరులో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్'ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో ఆయన మాట్లాడనున్నారు. ఇక ఎన్టీఆర్ వర్ధంతిని కూడా మైదుకూరులోనే సీఎం చంద్రబాబు నిర్వహించనున్నారు.

కాగా, శనివారం ఉదయం 10:30కి ఉండవల్లి నివాసం నుంచి ఉ.11:05 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి ఉ.11:50 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు కడప విమానాశ్రయం నుంచి మ. 12:10 నిమిషాలకు మైదుకూరులో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు కెఎస్సీ కళ్యాణ మండపానికి చేరుకుని ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1:50 నిమిషాలకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారు. కేఎస్సీ కళ్యాణ మండపం నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి వినాయక నగర్‌లోని మున్సిపల్ కార్మికుని ఇంటిని సందర్శించి చెత్త సేకరణ గురించి వివరిస్తారు. మధ్యాహ్నం 2:15 నిమిషాలకు అక్కడ నుంచి బయలుదేరి నేషనల్ గ్రీన్ కాప్స్‌తో కలిసి నడుస్తూ రాయల కూడలి ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకుంటారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభిస్తారు. సాయంత్రం 4: 30 నిమిషాలకు హెలిపాడ్ ప్రాంగణానికి చేరుకుని 4:40 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 4: 50 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి సాయంత్రం 5:35లకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అమరావతిలోని నివాస గృహానికి 6 గంటల 15 నిమిషాలకు సీఎం చంద్రబాబు చేరుకుంటారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు భేటీ

○కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** 'పర్యావరణ హితమైన వాహనాల వినియోగం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు విరివిగా అందుబాటులోకి రావాలి' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పీపుల్ టెక్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రివర్యులతో భేటీ అ-య్యారు. ఈ సంస్థ ఓర్వకల్లు దగ్గర 12వందల ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికిల్ పార్కు నెలకొల్పేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంతో ఎం.ఓ.యూ. చేసుకొంది.

ఇందుకు సంబంధించిన వివరాలను పీపుల్ టెక్ గ్రూప్ సి.ఈ.ఓ. టి.జి.విశ్వప్రసాద్ తెలియచేశారు. 'వాహన తయారీ, ఆర్. అండ్ డి. కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్స్, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ప్రాంతాలాంటివి ఇందులో ఉంటాయి. దేశంలో ఇదే తొలి ప్రైవేట్ ఈ.వి. పార్కు. దీని ద్వారా రూ.13 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయనీ, 25 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయ'ని వివరించారు.

పవన్ కల్యాణ్ స్పందిస్తూ 'కర్నూలు జిల్లా ఓర్వకల్లు దగ్గర ఎలక్ట్రిక్ వెహికిల్ పార్క్ ఏర్పాటు కానుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇదొక మైలు రాయి. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకి అనువైన విధానాలు తీసుకొచ్చింది' అన్నారు. ఉప ముఖ్యమంత్రి సమావేశమైన వారిలో భాస్కర రెడ్డి, రవికిరణ్ ఆకెళ్ళ, బాబ్ డఫ్ఫీ, స్టీవ్ గెర్బర్, హెరాల్డ్ రక్రిజెల్ ఉన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు జీవం



○వైసీపీ హయాంలో నిర్లక్ష్యం, ఎన్డీయే హయాంలో అభివృద్ధి
○ప్రధాని, ముఖ్యమంత్రికి ప్రజల తరపున కృతజ్ఞతలు
○ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు జీవం
○వైసీపీ హయాంలో నిర్లక్ష్యం, ఎన్డీయే హయాంలో అభివృద్ధి
○ప్రధాని, ముఖ్యమంత్రికి ప్రజల తరపున కృతజ్ఞతలు
○విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం సజీవం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్డీయే ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం భారీ ప్యాకేజీ ప్రకటించి విశాఖ ఉక్కుకు జీవం పోసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

వైసీపీ హయాంలో విశాఖ ఉక్కును నిర్లక్ష్యం చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా నిలుపుదల చేయడమే కాకుండా భారీ ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

రెండేళ్లలో విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందని, స్టీల్‌ప్లాంటును అప్పుల్లో నుంచి బయటకు తేవడమే ప్రథమ కర్తవ్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

రూ.11,440 కోట్ల ప్యాకేజీకి నిర్ణయంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమే అని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

రాష్ట్ర ప్రజలు, ఉత్తరాంధ్ర ప్రజల తరపున ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## జీ తెలుగులో ... మంతెన సత్యనారాయణ రాజుతో 'ఆరోగ్యమే మహాయోగం' జనవరి 20న తిరిగి ప్రసారం




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** వైవిధ్యభరితమైన వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించే కార్యక్రమాలను అందిస్తున్న జీ తెలుగు, మరోసారి ప్రజల కోసం ఎంతో ఆసక్తికరమైన ఆరోగ్య కార్యక్రమాన్ని పున:ప్రారంభిస్తోంది. ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు అందించే సమగ్ర ఆరోగ్య సమాచారం, సలహాలు, మరియు సందేహాల సమాధానాలతో మన్నించిన 'ఆరోగ్యమే మహాయోగం' కార్యక్రమం జనవరి 20న నుంచి ప్రారంభమవుతోంది.

1278 ఎపిసోడ్ల సుదీర్ఘ ప్రసారంతో అశేష ప్రేక్షకాదరణ పొందిన ఈ కార్యక్రమం, మరింత సమగ్రతతో జనవరి 20న తిరిగి ప్రారంభం కానుంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఉదయం 8:30 గంటలకు జీ తెలుగులో ప్రసారమవుతుంది.

ఈ కార్యక్రమానికి అన్నపూర్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించనుండగా, ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు ప్రేక్షకుల సమస్యలు, సందేహాలకు సరైన సమాధానాలు అందిస్తారు. సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితానికి అవసరమైన జాగ్రత్తలు, శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి సంబంధించి జీవనశైలిలో తీసుకోవలసిన మార్పులు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయబడతాయి.

ఆహారం, ఆరోగ్యం, ఫిట్నెస్, అందం వంటి అంశాలపై చర్చించి, ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే సలహాలను అందించే 'ఆరోగ్యమే మహాయోగం' కార్యక్రమాన్ని తప్పక వీక్షించండి. జనవరి 20న మీ జీ తెలుగులో.

## షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై విచారణకు ఏకసభ్య కమిషన్ పర్యటన

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై విచారణ చేయడానికి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. భారత సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 1న వెలువరించిన తీర్పు ప్రకారం ఈ కమిషన్ ఏర్పాటు చేయబడింది.

కమిషన్ ఈ నెల 20న అనంతపురం జిల్లా మరియు 21న చిత్తూరు జిల్లాలలో పర్యటించనుంది. పూర్వ జిల్లాల ప్రధాన కార్యాలయాలలో నిర్వహించబడే సమావేశాల్లో కమిషన్, షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణకు సంబంధించి వ్యక్తులు, సంస్థల నుండి విజ్ఞప్తులు స్వీకరించనుంది. ఈ సమావేశాలకు సంబంధిత పూర్వ జిల్లాలతో పాటు ఆ జిల్లాల నుండి కొత్తగా ఏర్పడిన జిల్లాలకు చెందిన వారు హాజరు కావచ్చు.

కమిషన్ ఈ పర్యటన ద్వారా షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై మరింత సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందించనుంది.

## మోహన్‌బాబు ఫ్యామిలీలో ఇరువురిపై కేసులు నమోదు



○ఏ 1గా మంచు మనోజ్

**చంద్రగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** సీనియర్ నటుడు, దర్శక, నిర్మాత మంచు మోహన్‌బాబు ఇంట కొనసాగుతున్న వివాదాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. గత కొన్ని రోజులుగా కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటుండడం తెలుగు రాష్ట్రాల్లో చర్చాంశనీయంగా మారింది.

రెండు రోజుల క్రితం మంచు మనోజ్, తన భార్యతో కలిసి మోహన్‌బాబు వర్సిటీకి రాగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తనపై, భార్య మౌనికపై దాడులకు పాల్పడ్డారంటూ మంచు మనోజ్ చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా వర్సిటీలోకి చొచ్చుకు వచ్చేందుకు మనోజ్ ప్రయత్నించారని మోహన్‌బాబు పీఏ చంద్రశేఖర్ నాయుడు పోలీసు స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేశాడు.

దీంతో ఫిర్యాదులను పరిశీలించిన పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. పీఏ చంద్రశేఖర్ నాయుడు ఫిర్యాదుతో నమోదైన కేసులో ఏ-1గా మనోజ్, ఏ-2గా మౌనిక, మరో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా మనోజ్ ఫిర్యాదు కేసులో ఏ-1గా విజయ్ సింహా, ఏ-2 గా సురేంద్ర, మరో 7గురిపై కేసులు నమోదు చేశామని వివరించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్‌బాబుపైనా కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.

# జగన్ చేతులు దులుపుకుంటే.. మేం చేతల్లో నిలబెట్టుకున్నాం

○హెూంమంత్రి వంగలపూడి అనిత



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** జగన్ ప్రభుత్వం మాట ఇచ్చి చేతులు దులుపుకుంటే, కూటమి ప్రభుత్వంచేతల్లో నిలబెట్టుకున్నదని హెూంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం ప్యాకేజీ ప్రకటించడంపై స్పందిస్తూ.. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె.. విశాఖ ఉక్కుకు కొత్త ఊపిరులూదిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు అని అన్నారు. అలాగే విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు నినాదం వెనుక దాగున్న తెలుగు ప్రజల భావోద్వేగాలని, దాని ప్రతిష్టను తెలియజేస్తూ పలుమార్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భారత ప్రధాని మోదీ తో సహా కేంద్రమంత్రులతో జరిపిన చర్చలకు దక్కిన ఫలితమని తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ నేడు అధికారికంగా రూ.11,440 కోట్లతో ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం కూటమి ప్రభుత్వం సాధించిన ఘనవిజయమని సంతోషం వ్యక్తం చేశారు. నాడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు చొరవతీసుకుని స్వర్గీయ వాజ్ పేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో రూ.1600 కోట్ల రుణాలను మాఫీ చేసిన విషయం చెప్పుకోవడం కూడా అనివార్యమని చెప్పారు. అది మా అధినాయకుడు చంద్రబాబు దార్శనికత, చిత్తశుద్ధి, అంకితభావానికి నిదర్శనమని అన్నారు. మెడలు వంచుతామని ప్రజలకిచ్చిన మాటను వమ్ము చేస్తూ 23 మంది ఎంపీలనిచ్చినా తలొగ్గి గత జగన్ ప్రభుత్వం మొక్కుబడిగా లేఖలు రాసి చేతులు దులుపుకుందని, కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఇచ్చిన మాటను చేతల్లో నిలబెట్టుకున్నదని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్ , హెచ్‌ కుమారస్వామి, అశ్విని వైష్ణవ్ లకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# శని, ఆదివారాల్లో.. విశాఖ-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు



**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సంక్రాంతి సెలవులు ముగిశాయి. పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన నగర వాసులు, ఉద్యోగులు అందరూ హైదరాబాద్‌కు తిరుగు పయాణయ్యారు. దీంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం నుంచి చర్లపల్లికి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. ఈ రైళ్లు 18, 19 తేదీల్లో అందుబాటులో ఉండనున్నాయి.

**విశాఖ-చర్లపల్లి-భువనేశ్వర్ (08549/08550)**

ఈ రైలు 18వ తేదీ రాత్రి 7.45 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరుతుంది. 19వ తేదీ ఉదయం 7 గంటలకు చర్లపల్లికి చేరుతుంది. అదేరోజు ఉదయం 9 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి సాయంత్రం 7.30 గంటలకు విశాఖ చేరుకుంటుంది. 7.50 గంటలకు బయలుదేరి ఈ నెల 20న తెల్లవారు జామున 2.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ రైలు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, విజయవాడ, గుంటూరు, మిర్యాలగూడ, నల్లగొండ స్టేషన్లలో ఆగుతుంది.

**విశాఖ-చర్లపల్లి-విశాఖ (08509/08510)**

ఈ రైలు జనవరి 18న సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయల్దేరుతుంది. 19న ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుతుంది. అదేరోజు ఉదయం 10 గంటలకు చర్లపల్లి నుంచి పయణమై రాత్రి 10 గంటలకు విశాఖకు చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ స్టేషన్లలో ఆగుతుంది.

**విశాఖ-చర్లపల్లి-విశాఖ (08551/08552)**

ఈ రైలు 19న సాయంత్రం 6.20గంటలకు విశాఖపట్నంలో బయలుదేరి 20న ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుతుంది. మళ్లీ ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి రాత్రి 10 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ స్టేషన్లలో ఆగుతుంది.

# డ్వాక్రా సంఘాల ద్వారా స్వయం ఉపాధి లక్ష్యంగా ప్రభుత్వ కృషి : ఎంపీ కేశినేని శివనాథ్



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లోని ప్రతి కుటుంబంలో కుటీర పరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి సాధించవచ్చు అని తద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి పెంచుకోవచ్చని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని) అన్నారు. శుక్రవారం విజయవాడ పార్లమెంటు సభ్యుని కార్యాలయంలో జరిగిన జిల్లాలోని అన్ని మండల డ్వాక్రా సంఘాల సమైక్యల అధ్యక్షులు సమావేశంలో కేశినేని శివనాథ్ చిన్ని గారు పాల్గొని వారితో మాట్లాడినారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త తయారు కావాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని. దాన్ని సాధించడానికి జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ మరియు పంచాయతీరాజ్ ద్వారా అనేక కుటీర పరిశ్రమలు పై ఉపాధి అవకాశాలు అవగాహన కార్యక్రమాలు పెంపొందించడానికి రెండవసారి హైదరాబాదులో ఉన్న జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ కు ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని మండలాల్లోని డ్వాక్రా సంఘాల సమైక్య అధ్యక్షులను పంపిస్తున్నామని అన్నారు. వీరు అక్కడ ఎన్ ఐ ఆర్ డి నిర్వహిస్తున్న కుటీర పరిశ్రమలను అవగాహన చేసుకుని వారి మండలాల్లోని ఆ కుటీర పరిశ్రమలు వేటికి అణువుగా ఉన్నాయో అధ్యయనం చేసి వాటిని అమలు చేయాలని తద్వారా ప్రతి కుటుంబంలో వ్యాపారవేత్తలను తయారు చేయాలని కోరినారు. ఈ రకంగా జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దానికి కేంద్ర ప్రభుత్వం నుండి వస్తున్న అనేక పథకాలను ఈ జిల్లాలో అమలు చేయడానికి తను కృషి చేస్తానని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులందరూ మరియు నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని గారితో పాటు అధికారులు. అన్ని మండలాల సమైక్యల అధ్యక్షులు మరియు జిల్లా సమైక్య అధ్యక్షురాలు కందుల కల్పన . ప్రోగ్రాం కోఆర్డినేటర్లు జీవీ నరసింహారావు. సొంగ సంజయ్ వర్మ మరియు తెలుగు మహిళా అధ్యక్షురాలు కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 19 నుంచి శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

○ఏర్పాట్లపై ఈవో సమీక్ష



**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్ ):** జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దాదాపు 11 రోజుల పాటు ఉత్సవాలు దేవస్థానం వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రమంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఈవో శ్రీనివాసరావు దేవస్థానం అధికారులు, అర్చకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సంక్రాంతి బ్రహ్మోత్సవాలు విజయవంతయ్యేందుకు సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు.

ప్రతి ఉద్యోగి భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో శ్రద్ధ వహించాలని సూచించారు. ఎక్కడా అసౌకర్యం కలుగకుండా ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను మేరకు ఏర్పాట్లలో నిమగ్నం కావాలని చెప్పారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19న మొదలవుతాయని తెలిపారు. భక్తులు ముందస్తుగానే శ్రీశైలక్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలోనే ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమష్టిగా విధులు నిర్వర్తించాలని చెప్పారు.

**కైంకర్యాల్లో సమయపాలన పాటించాలి..**

వైదిక సిబ్బంది, ఆలయ విభాగ అధికారులు పరస్పర సమన్వయంతో ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కైంకర్యాలన్నీ సంప్రదాయబద్ధంగా జరిపించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఉత్సవాల్లో కైంకర్యాల సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. మహాశివరాత్రి పర్వదినమైన ఫిబ్రవరి 26న జరిగే ప్రభోత్సవం, పాగాలంకరణ, బ్రహ్మోత్సవ కల్యాణం, మరుసటి రోజున నిర్వహించే రథోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి తదితర చోట్ల చేయాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..**

శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, జ్యోతిర్ముడి సమర్పణకు ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దర్శనం కోసం బారులు తీరే భక్తులకు ఎప్పటికప్పుడు మంచినీరు, అల్పాహారం అందజేయాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు. ఇందు కోసం స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. క్యూలైన్లలో బారికేడ్లు ధృడంగా ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు.

పార్కింగ్ ప్రదేశాల వివరాలు స్పష్టంగా తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులకు లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో పోలీస్‌శాఖ సహకారం తీసుకోవాలన్నారు. పాతాళగంగలో రక్షణ ఏర్పాట్లు, దస్తులు మార్చుకునేందుకు అవసరమైన గదుల ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఈవో ఆర్ రమణమ్మ, ప్రధాన అర్చకులు వీరస్వామి, ఉమానాగేశ్వరశాస్త్రి, పూర్ణానంద ఆరాధ్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467